
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 3 సెప్టెంబరు 2024 | 5

5న బొమ్మూరులో మినీ జాబ్‌మేళా

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 2 : రాజమహేంద్రవరం (బొమ్మూరు)లోని నాక్ ప్రాంగణంలో ఈ నెల 5న మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి హరీష్ చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు తెలిపారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, అపోలో ఫార్మసీ, కేఎల్ గ్రూపు కంపెనీలు హాజరవుతున్నాయని తెలిపారు. 19 నుంచి 35 ఏళ్లలోపు వయసు కలిగిన వారు అర్హులన్నారు. వివరాలకు 7396740041 నెంబరులో సంప్రదించాలన్నారు.



కార్పొరేషన్‌లో ఎలక్ట్రికల్ వాహనాలు

ఆ 8 వాహనాలు ఏమయ్యాయి!

- కార్పొరేషన్‌లో కార్లు మాయం
- 2019లో 15 వాహనాలు కేటాయింపు
- ప్రస్తుతం కనిపించేవి ఏడు మాత్రమే
- నేటికీ కానరాని 8 వాహనాల ఆచూకీ
- అధికారులు సొంత కార్ల వినియోగం
- కార్పొరేషన్ ఖర్చుతో షికారు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 2 : రాజమహేంద్రవరం నగర పాలక సంస్థకు చెందిన ఎలక్ట్రికల్ వాహనాలు మాయమయ్యాయి. ఎక్కడ ఉన్నాయో ఎలా ఉన్నాయో కూడా తెలియదు. 2019 లో 15 మహేంద్ర విట్ ఎలక్ట్రికల్ వాహనాలను నగరపాలక సంస్థకు ప్రభుత్వం కేటాయించింది. ఈ వాహనాలను నగరపాలక సంస్థలో వివిధ విభాగాల అధికారులకు కేటాయింపులు చేశారు. ఈ మేరకు కార్పొరేషన్ ఆవరణలోనే రీచార్జ్ పాయింట్లను ఏర్పాటు చేసి షెడ్లు నిర్మించారు. కొంత కాలం ఈ ఎలక్ట్రికల్ వాహనాలు బాగానే పనిచేశాయి. దీంతో కార్పొరేషన్‌కు చాలా ఆదా అయ్యింది. కట్ చేస్తే ఈ 15 వాహనాల్లో 8 కార్పొరేషన్‌లో కనిపించడంలేదు. కేవలం ఏడు వాహనాలు మాత్రమే తిరుగుతున్నాయి. మిగిలినవి మరమ్మతులకు గురయ్యాయా.. అసలు ఉన్నాయో లేవో కూడా తెలియని పరిస్థితి. ఎందుకంటే కార్పొరేషన్ షెడ్‌లో ఎప్పుడు చూసినా కేవలం ఆ ఏడు వాహనాలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. మిగిలిన వాహనాల ఆచూకీ మాత్రం లేదు.వాటిని మరమ్మతుల నిమిత్తం షెడ్‌కు తీసుకెళ్లినట్టు చెబుతున్నారు. ఎంత షెడ్‌కి తీసుకెళ్లినా నెలలోపే ఇచ్చేస్తారు అయితే చాలా కాలంగా అవి కనిపించకపోవడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి.ఆ వాహనాల స్థానంలో కొంత మంది అధికారులు కార్పొరేషన్ ఆయిల్‌తో వారి సొంత వాహనాలు వినియోగించడం కనిపించింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మేల్కొని ఆ 8 వాహనాలు ఏమయ్యాయనే దానిపై దృష్టి సారించాల్సి ఉంది.

నెలకూ ఆయిల్‌కే రూ.18 లక్షలు

గతంలో నగరపాలక సంస్థకు తక్కువ సొంత వాహనాలు ఉండేవి. కార్పొరేషన్ కమిషనర్‌కు మాత్రమే నగరపాలక సంస్థ వాహనం ఉండేది. అప్పట్లో మేయర్‌కు సొంత వాహనం కొనుగోలు చేశారు. అయితే అడిషనల్ కమిషనర్,డిప్యూటీ కమిషనర్‌తో పాటు ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్ రెవెన్యూ విభాగాల ఉన్నత అధికారులకు ప్రైవేట్ కార్లను టెండరు పద్ధతిలో పెట్టుకునేవారు.నగరపాలక సంస్థకు చెందిన వాహనాలు వినియోగించే ఆయిల్‌కు నెలకు రూ.18 లక్షలు ఖర్చవుతుండడంతో గత కమిషనర్లు క్రమేపి ఆయా వాహనాలను తగ్గించుకుంటూ వచ్చారు.. దీనిలో భాగంగా ప్రభుత్వం ఎలక్ట్రికల్ వాహనాలను సమకూర్చింది. ప్రస్తుతం ఆ వాహనాలు కనిపించక పోవడంతో ముణ్ణాళ్ల ముచ్చటగానే మారింది.




కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వరద

గోదారొచ్చింది!

కొవ్వూరు, సెప్టెంబరు 2 : మళ్లీ గోదారొచ్చింది.. ఇప్పటి వరకూ ఈ ఏడాది ఒక్కసారి మాత్రమే పెద్ద ఎత్తున వరద వచ్చింది..ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా అఖండ గోదావరి సోమవారం వరదతో పోటెత్తింది.గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, ఉపనదులు పొంగి గోదావరిలో కలుస్తున్నాయి. దీంతో కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద అఖండ గోదావరి పెరిగింది. క్షేత్రంలోని వీరభద్రస్వామి ఆలయం ఎదుట స్నానఘట్టంలో కాశీ విశ్వేశ్వరుడిని గోదావరి అభిషేకిస్తూ ముంచెత్తింది. వరద ప్రవాహంతో రాజమహేంద్రవరం, కొవ్వూరు మధ్య గోదావరి నిండు కుండలా ప్రవహిస్తుంది.

అభిమానం గుర్తుండేలా..

సాయం చేస్తే పది మందికి ఉపయోగపడాలి.. పది కాలాల పాటు నిలిచేలా ఉండాలి.. మరి అటువంటి సాయం ఎలా ఉంటుందంటారా? ఇలాగే.. భోజనం పెడితే ఒక రోజులో అరిగిపోతోంది.. చీరలు ఇస్తే ఒక ఏడాదిలో పాడైపోతాయి.. ఆ సాయానికి ఖర్చు చేసే డబ్బుతో ఒక పాఠశాలను దత్తత తీసుకుంటే ఎలా ఉంటుంది.. రాజానగరానికి చెందిన జన సైనికులు ఇదే చేశారు.. తమ అభిమాన హీరో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని ఏదో ఒకటి చేయాలని చాలాకాలంగా ఆలోచిస్తున్నారు.. ఒక ఐడియా జీవితాన్నే మార్చేస్తుందన్నట్టు.. వారికొచ్చిన ఐడియా పది మంది పిల్లలకు వెలుగుతెచ్చింది.. ఇంతకీ అదేమిటంటారా.. ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని దత్తత తీసుకుని డిజిటల్ తరగతిని తీర్చిదిద్దారు.. సోమవారం పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆ తరగతిని జనసేన రాష్ట్ర కార్యదర్శి గంటా స్వరూపాదేవి ప్రారంభించారు.. - రాజానగరం



మేమున్నామని..

వరద బాధితులకు అండగా..

- సీఎం పిలుపుతో స్పందన
- జిల్లా ప్రజల మహా దాతృత్వం
- ఒక్కరోజులోనే ముందుకు
- 16 వ్యాన్ల ద్వారా సాయం
- ఆహారపొట్లాలు..పాలు..నీళ్లు
- బెజవాడకు తరలింపు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యో)

మేమున్నా అంటూ ముందుకొచ్చారు.. వరద బాధితులకు అండగా నిలిచారు.. జిల్లా ప్రజలు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు..గోదావరి జిల్లా ప్రజలు కష్టం వస్తే ఎంతలా ఆదుకుంటారో నిరూపించారు. భారీవర్షాలు, బుడమలేరు వరద ప్రభావానికి విలవిల్లాడిన విజయవాడ వరద బాధితులకు తూర్పుగోదావరి అండగా నిలిచింది. కనీవినీ ఎరుగని రీతిలో సాయం అందించారు. వరద బాధితులకు అండగా ఉండాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపునకు జిల్లా స్పందించింది. కలెక్టర్ పి.ప్రశాంతి ఆధ్వర్యంలో జిల్లాలో అనేక అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు ముందుకొచ్చారు. దాతల నుంచి రకరకాల రూపాల్లో సేకరించిన వాటిని జిల్లాలో పలు చోట్ల శాఖల ఆధ్వర్యంలో వండించి, సేకరించి లక్షలాది ఆహార పొట్లాలను, వాటర్ ప్యాకెట్లు, బాటిల్స్‌ను, బిస్కెట్లను 16 వాహనాల ద్వారా విజయవాడ పంపించారు. సీఎం నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు రాజమహేంద్రవరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయం వివిధ కంపెనీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. విజయవాడ వరద బాధితులకు సాయం అందించాలని కోరారు. దీనిపై స్పందించిన పెద్ద ఎత్తున సహాయం అందజేశారు.దాతృత్వంతో ముందుకు వచ్చిన అధికారులు, రైస్‌మిల్లర్లు,ఐఎంఏ, వివిధ కంపెనీలు, ఎమ్మెల్యేలు, విజయవాడ ప్రజలకు తమ వంతుగా సహాయ సహకారాల అందించ డానికి ముందుకొచ్చిన ప్రతీ ఒక్కరికీ అభినందలు తెలిపారు.

సాయం చేశారిలా..

జిల్లా రెవెన్యూ, ఇతర శాఖల ఆధ్వర్యంలో 26 వేల ఆహార పొట్లాలు, 20 వేల కొవ్వొత్తులు, 20 వేల అగ్గిపెట్టెలు, 50 వేల బ్రెడ్ ప్యాకెట్లు, 25వేల బిస్కెట్ ప్యాకెట్లు, 2 లక్షల వాటర్ ప్యాకెట్లు పంపించారు. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 50 వేల బిస్కెట్ ప్యాకెట్లు, 20 వేల ఆహార పొట్లాలు, 20 వేల ఫుడ్ ప్యాకెట్లు, 20 వేల వాటర్ బాటిల్స్ పంపించారు. తిరుమల విద్యా సంస్థల తరఫున 4 వేల బిరియానీ ప్యాకెట్లు, 8వేల వాటర్ బాటిల్స్ పంపారు. మిల్లర్ల అసోసియేషన్ తరఫున 5 వేలు,ఐఎంఏ ద్వారా 5 వేలు,హోటల్ అసోసియేషన్ తరఫున 8 వేలు, హార్లిక్స్ ఫ్యాక్టరీ తరఫున 2500 ఆహార పొట్లాలు ప్రత్యేక వాహనాల ద్వారా పంపామన్నారు. కోరు కొండ నుంచి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ 5 వేల ఆహారపొట్లాలు అందజేశారు.కొవ్వూరు నియోజకవర్గం నుంచి 6 వేల ఆహారపొట్లాలు తరలించారు.కలెక్టర్ క్యాంపు కార్యాలయం వద్ద పాల వాహనానికి, సాయికృష్ణ థియేటర్ వద్ద ఫుడ్ ప్యాకెట్లు తీసుకెళ్లే వాహనాలకు కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్న రాముడు జెండాఊపి ప్రారంభించారు.



విజయవాడలో వరద బాధితులకు పంపించే పులిహోర పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



విజయవాడ వెళ్లే ఆహార వ్యాన్‌కు జెండా ఊపుతున్న ఎమ్మెల్యే ముప్పిడి



విద్యుత్ భద్రతకు సంబంధించి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, కార్మికులు

తడిచేతులతో స్విచ్‌లు వేస్తే ప్రమాదం

ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 2 : తడిచేతులు.. తడికాళ్లతో ఉన్నప్పుడు స్విచ్‌లు వేయరాదని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ కె.తిలక్ కుమార్, ఈఈ నక్కపల్లి శామ్యూల్ సూచించారు. విద్యుత్ పట్ల ప్రజలు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. రాజమహేంద్రవరం మోరంపూడి టౌన్ 1 సబ్ డివిజన్ కార్యాలయం ఆవరణలో సోమవారం జరిగిన విద్యుత్ భద్రత దినోత్సవంలో వారు మాట్లాడారు.వైరింగ్‌కు ఉపయోగించే వైర్లు,స్విచ్‌లు ఐఎస్ఐ నాణ్యత కలిగి ఉండాలన్నారు. ఇంటికి ఎర్త్ ఇచ్చినప్పుడు కనీసం రెండు ఎర్త్ ఎలక్ట్రోడ్లను అమర్చాలని సూచించారు. విద్యుత్ భద్రతకు సంబంధించి ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో టౌన్ డీఈఈ గాబ్రియేల్, టౌన్ 1 డీఈఈ మాల్యాద్రి, ఏఈలు, జేఈలు తదితరులు పాల్గొన్నారు.

2689.22 హెక్టార్లలో పంట మునక

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీ వర్షాలకు 4 మండలాల పరిధిలోని 44 గ్రామాల్లో 2689.22 హెక్టార్ల పంట మునిగినట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని గోకవరం మండలంలో 5020 హెక్టార్లలో పంట వేయగా 6 గ్రామాల పరిధిలో 755 మంది రైతులకు చెందిన 668 హెక్టార్లు మునిగిందన్నారు. కోరుకొండ మండలంలో 4600 హెక్టార్లలో వరి పంట వేయగా 18గ్రామాల పరిధిలో 1800 మంది రైతులకు చెందిన 1200 హెక్టార్లు, నిడదవోలు మండలంలో 16500 హెక్టార్లలో వరి పంట వేయగా 5 గ్రామాల్లో 31 మంది రైతులకు చెందిన 25.22 హెక్టార్ల పంట నీట మునిగిందన్నారు. సీతానగరం మండలంలో 3966 హెక్టార్లలో వరిసాగు చేయగా 14 గ్రామాల పరిధిలో 942 మంది రైతులకు చెందిన 776 హెక్టార్ల పంట మునిగిందని తెలిపారు. అదే మండలంలోని ఒక గ్రామంలో 10 మంది రైతులకు చెందిన 20 హెక్టార్ల చెరకు మునిగినట్టు చెప్పారు. కొవ్వాడ కాలువ ఉధృతి తగ్గిందని, ఎర్రకాలువకు వరదొచ్చినా ఇబ్బందిలేదని పేర్కొన్నారు.



గాలిలో.. ఎగిరారు!

విమాన ప్రయాణానికి డిమాండ్

- విజయవాడ అతలాకుతలం
- బస్సులు బంద్..రైళ్లు రద్దు
- తప్పని విమానయానం
- నిండుగా ఎయిర్‌పోర్ట్
- రెండు రోజులుగా కిటకిట
- పెరిగిన ప్రయాణికుల సంఖ్య

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వర్షాల కారణంగా రైలు, రోడ్డు రవాణా అస్తవ్యస్తం కావడంతో ప్రజలు వాయు మార్గాన్ని ఎంచుకోక తప్పని పరిస్థితి నెలకొంది. ఆది, సోమవారాల్లో రాజమహేంద్రవరం (మధురపూడి) విమానాశ్రయం నుంచి రాకపోకలు పెరిగాయి. నాలుగు రోజుల నుంచీ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు సోమవారం కాస్త శాంతించిన విషయం తెలిసిందే. రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్, బెంగళూరు ఎక్కువగా వెళుతుంటారు. వరద వల్ల జంక్షన్ పాయింట్ అయిన విజయవాడ అతలాకుతలమైంది. దీంతో రైలు పట్టాలు, రోడ్లు దెబ్బతిన్నాయి.ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం గుండా వెళ్లే సుమారు 20 రైళ్లను రద్దు చేశారు.ఆదివారం సాయంత్రం కాకినాడ- రేణిగుంట ఎక్స్‌ప్రెస్‌ను రాజమహేంద్రవరం వచ్చిన తరువాత నిలిపివేయడంతో 1500 మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.విజయవాడ వెళ్లే బస్సులను కూడా నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు విమానాల వైపు చూస్తున్నారు. గత వారం ప్రారంభంలో సాధారణంగా ఉన్న రద్దీ.. శని, ఆది, సోమవారాల్లో క్రమంగా పెరిగింది. ప్రస్తుతం రాజమహేంద్రవరం నుంచి ఇండిగో మాత్రమే ఏటీఆర్-72 రకం విమానాలను ఆపరేట్ చేస్తోంది. ఆదివారం, బుధవారం, శనివారాల్లో 10, మిగతా రోజుల్లో 9 విమానాలను నడుపుతోంది. హైదరాబాద్‌కు 7, బెంగళూరుకు 2, చెన్నైకి ఒకటి చొప్పున రాకపోకలు సాగిస్తున్నాయి. విమాన ధరలు ఇప్పటికీ సామాన్యుడికి అందనంత ఎత్తులోనే ఉన్నాయి. జిల్లాకో ఎయిర్‌పోర్ట్ అంటూ గాలి మాటలు చెప్పిన గత వైసీపీ ప్రభుత్వం.. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, ఏజెన్సీ ప్రజలకు ఏకైక వాయుమార్గమైన రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి ఒక్క ఆపరేటర్‌ని కూడా పెంచలేక పోయింది. ఒకే ఆపరేటర్ ఉండడంతో పోటీతత్వం నిర్వీర్యమైంది. రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌కి రూ.4800 నుంచి రూ.7 వేల వరకూ వెచ్చించాల్సి వస్తోంది. దీంతో అత్యవసరమైతే తప్ప సామాన్యుడి విమానం ఎక్కలేని దుస్థితి ఉంది. నైట్ ల్యాండింగ్ సదుపాయం వచ్చిన తర్వాత రాత్రి 9.30 గంటలకు విమానం అందుబాటులోకి వచ్చింది. కానీ సామాన్యుడికి మాత్రం ఎలాంటి ప్రయోజనమూ లేకుండా ఉంది. వాస్తవానికి ఒకేసారి మూడు విమానాల ప్రయాణికులు.. అంటే సుమారు 225 మంది ఒక్కసారిగా వచ్చినా హ్యాండిల్ చేసే సామర్థ్యం విమానాశ్రయానికి ఉంది.కానీ ఆ మేరకు విమాన ఆపరేటర్ల సంఖ్యను పెంచాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం 10 విమానాల్లో మొత్తం గరిష్ఠంగా 760 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించవచ్చు.

విమాన ప్రయాణాలు ఇలా..

రోజు	రాక	పోక
శుక్రవారం	406	486
శనివారం	505	544
ఆదివారం	600	662
సోమవారం	700	750

ఆర్టీసీ సర్వీసులు పునరుద్ధరణ

జిల్లా అధికారిణి షర్మిలా అశోక

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 2 : భద్రాచలం, విజయవాడ రూటులో రద్దయిన ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించారు. భారీ వర్షాల కారణంగా ఈ రెండు రూట్లలో బస్సులు నడపడానికి కొంత ఇబ్బంది తలెత్తడంతో భద్రాచలం వయా మారేడుమిల్లి ఘాట్ రోడ్డు సర్వీసుతో పాటు విజయవాడ రూటులో కొన్నింటిని తాత్కాలికంగా రద్దు చేసిన సంగతి తెలిసిందే. వీటన్నింటినీ సోమవారం నుంచి పూర్తిస్థాయిలో నడిపేందుకు చర్యలు చేపట్టారు. వర్షాలు, వరదల కారణంగా ఒకటి, రెండురూట్లలో బస్సు సర్వీసులకు కాస్త ఇబ్బంది తలెత్తినా ప్రస్తుతం అన్ని సర్వీసులను యథాతథంగా తిప్పుతున్నామని ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిలా అశోక తెలిపారు. విజయవాడకు ట్రాఫిక్‌ను బట్టి ఆపరేట్ చేయడం జరిగిందని, రూటు కేన్సిల్ చేయలేదన్నారు. హైదరాబాద్ సర్వీసులు కూడా పూర్తిస్థాయిలో ఆపరేట్ చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రయాణికులు గమనించాలని తెలిపారు.

కలెక్టరేట్‌కు వచ్చినా.. ఇంతేనా!?

సమస్యలు పరిష్కారం కాక పలువురు ఆవేదన

- వచ్చిన వారే మళ్లీ మళ్లీ రాక
- బదలాయించి వదిలేస్తున్న వైనం
- లబోదిబోమంటున్న బాధితులు
- కలెక్టరేట్‌కు ఎందుకొస్తామని ప్రశ్న
- అడపాదడపా మాత్రమే పరిష్కారం
- కలెక్టర్ దృష్టి పెట్టాలని డిమాండ్
- పీజీఆర్ఎస్‌లో 144 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, సెప్టెంబరు 2 : వస్తున్నాం.. వెళుతున్నాం అంతే.. సమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. కిందిస్థాయి అధికారులకు బదలాయించి కలెక్టరేట్ అధికారులు వదిలేస్తున్నారని.. అక్కడ పనికాకపోవడంతో ఇక్కడకు వచ్చామని ఆలోచించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ఫిర్యాదులపై కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించాలని పలువురు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మీ కోసం ప్రజా సమస్యల పరిష్కారవేదిక జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వివిధ మండలాలకు చెందిన ప్రజలు వచ్చి అర్జీలు పెట్టుకున్నారు. 144 అర్జీలు వచ్చాయి.ఆర్ఆర్‌సీఎస్‌డీసీ ఆర్.కృష్ణనాయక్, జిల్లా సహకార సంఘాల అధికారి శ్రీరాములు ,దిశ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలో ఖాళీగా ఉన్నవాటికి మాత్రమే రేషన్ డీలర్ల నోటిఫికేషన్ ఇవ్వాలని రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు బి.రాజు, జనరల్ సెక్రటరీ ఎం.వెంకటేశ్వరరావు అర్జీ అందించారు. కడియం మండలం కడియపులంక వెంకాయమ్మపేటకు చెందిన డ్వాక్రా గ్రూప్ సభ్యులు తమ యానిమేటర్ తమకు తెలియకుండా అవకతవకలకు పాల్పడుతుందని బాధితులు ఫిర్యాదు చేశారు.నిడదవోలుకు సమిశ్రగూడెంకు చెందిన బుద్దేటి ఈశ్వర ప్రసాద్ తమ ప్రాంతంలో నడక దారిలో ఇల్లుకట్టడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని విన్నవించాడు., దవళేశ్వరానికి చెందిన దివ్యాంగుడు వేముల తిరపయ్య రూ.15 వేలు పింఛను ఇప్పించాలని అర్జీ పెట్టుకున్నాడు. ఇలా తదితర సమస్యలతో కలెక్టరేట్‌కు వచ్చారు.కలెక్టరేట్‌లో ఏపీఈ పీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ డిబాలశంకర్‌రావు, కలెక్టర్ ఏపీవో పి పాపారావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

పదేళ్లుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా..



నా పేరు దేవాదుల సుబ్రహ్మణ్యం.. మాది రాజమహేంద్రవరం ఇన్నీసుపేట.. సోమవారం కలెక్టరేట్‌లో అతని అర్జీ చూసి దానిని రాజమహేంద్రవరం ఆర్‌డీవోకు బదలాయించారు. చాలా ఏళ్లగా ఇదే జరుగుతుంది.. సమస్య మాత్రం పరిష్కారం కావడంలేదు. అంటూ అర్జీదారుడు సుబ్రహ్మణ్యం ఆవేదనతో వెళ్లిపోతుండగా ఆంధ్రజ్యోతి అతనితో మాట్లాడింది. రూరల్ మండలం కోలమూరులో సర్వే నెంబరు 627/5 ఏ1లోనా తండ్రి సత్యనారాయణాచార్యులకు 600 గజాల స్థలం ఉంది. అందులో 2003లో 300 చదరపు గజాల స్థలాన్ని విశాఖ వాటర్ పైప్‌లైన్‌కు తీసుకున్నారు. దీనికి సంబంధించి పరిహారం ఇవ్వలేదు.సుమారు పదేళ్లుగా తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడంలేదు. ఎప్పుడు వచ్చినా ఆర్‌డీవోకు బదలాయిస్తే ఎలా.. మళ్లీ మళ్లీ వస్తున్నామంటే కలెక్టర్ బాధ్యత తీసుకోవాలని కోరాడు. తనకు ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారని ఈ భూమి పరిహారమే తనకు దిక్కని కన్నీళ్లు పెట్టుకున్నాడు. అయితే వేదికపై కలెక్టర్ లేకపోవడంతో నిరాశచెందాడు. బాధితుడుకి న్యాయం చేయడంలో కలెక్టర్ ఏ విధంగా స్పందిస్తారో వేచిచూడాలి.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 23 అర్జీలు

రాజమహేంద్రవరం,సెప్టెంబరు 2 (ఆంధ్ర జ్యోతి):జిల్లా పోలీసు కార్యాల యంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం(మీకోసం) కార్యక్ర మా న్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 23 అర్జీలను ఎస్పీ నరసింహ కిశోర్ స్వీకరించారు. ఫిర్యాదుదారులతో మా ట్లాడి సత్వరమే పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఆయా పోలీస్ స్టేషన్ల బాధ్యులతో మాట్లాడి తగు సూచనలు చేశారు.అర్జీదారులు రెండోసారి డీపీవోకి అదే సమస్యపై రాకుండా చట్ట పరిధిలో సంతృప్తికరమైన న్యా యం చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ అనసూరి శ్రీనివాస రావు, సీఐ కె.మంగాదేవి, ఎస్ఐ అలీఖాన్ పాల్గొన్నారు.



కార్యాలయంలో అర్జీదారుల సమస్యలు వింటున్న ఎస్పీ నరసింహకిశోర్


హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1.64 కోట్లు

అన్నవరం, సెప్టెంబరు 2: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రూ.1,64,18,601 నగదు, 44 గ్రాముల బంగారం, 1880 గ్రాముల వెండి సమకూరాయి. 420 యుఎస్ఏ డాలర్లు, 490 యుఏఈ దిరహమ్స్, 140 ఇంగ్లాండ్ పౌండ్స్, మలేషియా డాలర్లు 100 లభించాయి. 34 రోజులకు ఈ ఆదాయం వచ్చినట్టు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్ పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో పురోహితులు, నాయీబ్రాహ్మణులు, సిబ్బంది పాల్గొన్నారు.


శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో లక్ష బిల్వార్చన చేస్తున్న రుత్వికులు

శ్రీపాద శ్రీవల్లభుడికి లక్ష బిల్వార్చన



పిఠాపురం, సెప్టెంబరు 2: కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాద శ్రీవల్లభులకు లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. శ్రీపాద శ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాల్లో రెండో రోజైన సోమవారం అర్చకులు, రుత్వికులు, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య బిల్వార్చన నిర్వహించారు. శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయ స్వామి, నృసింహ సరస్వతిలను విశేషంగా అలంకరించారు. అనంతరం మహన్యాసపూర్వక శత రుద్రాభిషేకం, సర్వ పుష్ప పూజ, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్ర నామార్చన, మంగళహారతి, వేద పారాయణ, రుత్విక్కులచే దత్త మూలమంత్ర అనుష్ఠానం, గురుచరిత్ర పారాయణ, శ్రీపాద శ్రీవల్లభ చరితామృత పారాయణ జరిగాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక శక్తికి ఊతమిచ్చేలా

విద్యార్థి విజ్ఞాన్ మంథన్



కాకినాడ రూరల్, సెప్టెంబరు 2: విద్యార్థి దశలోనే మేథస్సుకు పదును పెడితే జిజ్ఞాస పెంచి వారి ఉజ్వలమైన భవితకు బాటలు వేయవచ్చు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా అనేక ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తికి ఊతమిచ్చేలా ప్రయోగాలు, పరిశోధనల్లో రాణించేలా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పేరిట జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణా పరీక్ష నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో విజ్ఞాన భారతి, ఎన్‌సీఈఆర్టీ, విజ్ఞాన ప్రసాద్ సంస్థలు సంయుక్తంగా ఈ పరీక్ష నిర్వహిస్తున్నాయి. 2024-25 సంవత్సరానికి సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, కళాశాలల్లో ఆరవ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం ఏంపీసీ, బైపీసీ చదువుతున్న విద్యార్థులకు ఎన్‌సీఈఆర్టీ, ఎస్సీఎస్ఎం, సీబీఎస్ఈ, స్టేట్ బోర్డు కలిపి ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి దేశంలోని ప్రముఖ పరిశోధనా సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌తో పాటు ఏడాది పాటు నెలకు రూ.2వేలు చొప్పున భాస్కర స్కాలర్‌షిప్ పొందే అవకాశం కలుగుతుంది. దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది.

వంద మార్కులకు పరీక్ష:

జూనియర్ విభాగంలో (6 నుంచి 8వ తరగతి), సీనియర్ విభాగంలో (9 నుంచి 11 వరకు) 100 ప్రశ్నలకు వంద మార్కులు వుంటాయి. పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ కనబరుస్తూ జాతీయ స్థాయిలో అంతర్జాలం ద్వారా పరీక్షరాయవచ్చు. ఇంటి నుంచే ఆన్‌లైన్ విధానంలో స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ ద్వారా పాల్గొనవచ్చు. హిందీ, తెలుగు, ఆంగ్లంతో పాటు ఎనిమిది ప్రధాన ప్రాంతీయ భాషల్లో ఈ పరీక్ష నిర్వహిస్తారు.

ప్రత్యేక శిక్షణ: వీవీఎంలో పాల్గొన్న విద్యార్థులకు పాఠశాల స్థాయిలో 6 నుంచి 11 తరగతులకు ప్రతి తరగతిలోనూ ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు చొప్పున మొత్తం 18 మందికి ప్రతిభా పత్రాలను ఆన్‌లైన్‌లో అందజేస్తారు. జిల్లాస్థాయిలో కూడా ఇదే విధంగా అందజేస్తారు. 120 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి శిబిరానికి ఎంపిక చేసి... దానిలో ప్రతిభ చూపిన ప్రతి తరగతి నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 18 మందిని రాష్ట్ర స్థాయి విజేతలుగా ప్రకటించి వారికి రూ.5,000 (ప్రథమ), రూ.3,000 (ద్వితీయ), రూ.2,000 (తృతీయ) బహుమతులతో పాటు మెమెంటో, ధ్రువపత్రం ఇస్తారు. జాతీయ, జోనల్ స్థాయి విజేతలుగా నిలిచిన 18 మంది విద్యార్థులను హిమాలయన్స్‌గా ప్రకటిస్తారు. వారికి రూ.25వేలు (ప్రథమ), రూ.15వేలు (ద్వితీయ), రూ.10వేలు (తృతీయ) బహుమతులతో పాటు మెమెంటో, ధ్రువపత్రం ఇస్తారు. అంతే కాకుండా వారికి డీఆర్డీవో, ఇస్రో, సీఎస్ఐఆర్, బార్క్‌లలో 3 వారాల పాటు ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గత ఏడాది రాష్ట్ర స్థాయికి 20 మంది విద్యార్థులు ఎంపికయ్యారు.

- దరఖాస్తుకు గడువు : సెప్టెంబరు 15
- నమూనా పరీక్ష : అక్టోబరు 10
- ఫీజు: రూ.200
- రాష్ట్ర స్థాయి పరీక్ష : నవంబరు 26 లేదా డిసెంబరు 3, 10, 17 తేదీల్లో
- ప్రధాన పరీక్ష: అక్టోబరు 23 నుంచి 27
- సమయం : ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల మధ్యలో (90 నిమిషాలు మాత్రమే. ప్రతి విద్యార్థి పరీక్షకు ఒకసారి మాత్రమే లాగిన్ అవ్వాలి)

- ఏటా జాతీయ స్థాయి ప్రతిభాన్వేషణ పరీక్ష
- ప్రథమ విజేతకు రూ.25వేల నగదు బహుమతి
- ప్రముఖ పరిశోధనా సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం



విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

పిల్లి రమేష్, డీఈవో, కాకినాడ జిల్లా

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ప్రతిభాన్వేషణా పరీక్షను సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి.



ప్రతిభ నిరూపణకు చక్కని వేదిక

కేసరి శ్రీనివాసరావు, కౌశల్ జిల్లా సమన్వయకర్త

విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఈ పరీక్ష చక్కని వేదిక. విద్యార్థి స్థాయి నుంచే శాస్త్రవేత్తలను తయారు చేయడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ నిర్వహిస్తున్న పరీక్షల్లో ఇది ఒకటి.

ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి

ఎన్.శ్రీనివాస్ వినీల్, కాకినాడ జిల్లా సైన్స్ అధికారి

ఈ పరీక్షకు ఎక్కువ మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. దీనివల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందుతాయి.




సాయిలక్ష్మీచంద్ర ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న ఎంపీ హరీష్‌మాధుర్

ప్రాణాపాయ స్థితిలో ఉన్నా

- ఆస్తి అమ్మించి నా ఆరోగ్యాన్ని కాపాడండి
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సాయిలక్ష్మీ చంద్ర అర్జీ

అమలాపురం టౌన్, సెప్టెంబరు 2: ప్రాణాపాయ స్థితిలో ఉన్నా... బంధువుల నుంచి కూడా ప్రాణ హాని ఉంది. తండ్రిద్వారా సంక్రమించిన ఆస్తిని అమ్మి ఆరోగ్యాన్ని కాపాడాలని రాజులపూడి సాయిలక్ష్మీచంద్ర వేడుకుంటోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ఆమె తల్లి ఆరుద్రతో కలిసి వచ్చి అర్జీ అందించింది. 99శాతం దివ్యాంగురాలైన తనకు ప్రాణ రక్షణ కల్పించాలంది. తండ్రి ద్వారా సంక్రమించిన ఆస్తిని సొంతం చేసుకోవాలని కొందరు కుటుంబ సభ్యులు ప్రయత్నిస్తున్నారని వివరించారు. ప్రాణ రక్షణ కల్పించడంతో పాటు ఆస్తిని అమ్మి ఆరోగ్యాన్ని కాపాడాలని వేడుకుంది. ముందుగా ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ను కలుసుకున్నారు. వైద్య సేవల కోసం తన వంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఎస్పీ కృష్ణారావుతో ఎంపీ ఫోనులో మాట్లాడి సాయిలక్ష్మి పరిస్థితిని వివరించారు. పట్టణ పోలీసుస్టేషన్‌లో ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ఎంపీ భరోసా కల్పించారు.

డాక్టర్ సృజనకు ఢిల్లీ ఎయిమ్స్‌లో పీజీ సీటు



సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 2: కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ వాకలపూడి సంతోష్‌నగర్‌కు చెందిన విశ్రాంత సైనికుడు సూర్యదేవర రామారావు కుమార్తె డాక్టర్ సృజన ప్రతిష్ఠాత్మకమైన ఢిల్లీ ఎయిమ్స్‌లో అనస్తీషియా విభాగంలో పీజీ సీటు సాధించింది. కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ 2017 బ్యాచ్‌కు చెందిన సృజన వైద్య విద్యపై చేసిన పలు పరిశోధనలు, సైద్ధాంతిక వ్యాసాలకు 12 గోల్డ్ మెడల్స్ సాధించి బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్‌గా నిలిచింది. పీజీ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి సీటు దక్కించుకుంది. డాక్టర్ సృజనను ఆర్ఎంసీ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అభినందించారు. సైనికుడిగా తండ్రి రామారావు దేశానికి సేవలు అందించారని, ఆయన వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని పేదలకు ఉచిత వైద్య సేవలందిస్తున్న సృజనకు నగర ప్రముఖులు పలువురు అభినందనలు తెలిపారు.

రెండో రోజూ కొన్ని రైళ్లు రద్దు

- మరికొన్ని దారి మళ్లింపు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు

సామర్లకోట, సెప్టెంబరు 2: రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పెద్ద ఎత్తున చేరుకోవడంతో పలు రైల్వే ట్రాక్‌లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో విజయవాడ సెక్షన్‌లో రెండో రోజు అయిన సోమవారం పలు రైళ్లను రద్దు చేయగా మరికొన్ని రైళ్లను దారి మళ్లించారు. ప్రస్తుతం నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ రాకపోకలు సాగిస్తున్నాయి. రైళ్ల వేగాన్ని తగ్గించి నడపడంతో గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్నాయి. సోమవారం ఉదయం 8.30 గంటలకు సామర్లకోట చేరుకోవాల్సిన ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ మూడు గంటల ఆలస్యంగా వచ్చింది. ముంబై నుంచి భువనేశ్వర్ వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ 12.30 గంటలకు రావాల్సి ఉండగా నాలుగున్నర గంటలు ఆలస్యంగా వచ్చింది. ఆరు గంటలకు రావాల్సిన ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ మూడు గంటలు ఆలస్యంగా నడిచింది. సికింద్రాబాద్ నుంచి విశాఖ వెళ్లాల్సిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా ఆరు గంటలకు వచ్చింది. బొకారో ఎక్స్‌ప్రెస్ సుమారు రెండున్నర గంటలు ఆలస్యమైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. సామర్లకోట స్టేషన్ మొదటి ప్లాట్‌ఫామ్‌పై హెల్ప్ డెస్క్ కొనసాగించినట్టు సూపరింటెండెంట్ ఎం.రమేష్ చెప్పారు.

సోమవారం రద్దయిన రైళ్ల వివరాలు....

సికింద్రాబాద్-విశాఖ (22204), కడప-విశాఖ (17487), విశాఖపట్టణం-సికింద్రాబాద్ (12805), భువనేశ్వర్-బెంగళూరు (18463), తిరుపతి-కాకినాడ (17249), విశాఖపట్టణం-కడప (17488), విశాఖపట్టణం-తిరుపతి (08583), విశాఖపట్టణం-చెన్నై సెంట్రల్ (22869), భువనేశ్వర్-సికింద్రాబాద్ (17015), గుంటూరు-విశాఖపట్టణం (22702), భువనేశ్వర్-ముంబయి (11020), విశాఖపట్టణం-గుంటూరు (22701)

మంగళవారం రద్దు చేసిన రైళ్ల వివరాలు

సికింద్రాబాద్-విశాఖ (20707), విశాఖ-సికింద్రాబాద్ (20708), విశాఖపట్టణం-సికింద్రాబాద్ (20833), సికింద్రాబాద్-విశాఖపట్టణం (20834), బెంగళూరు-హౌరా (12864), తిరుపతి-విశాఖపట్టణం (08584), తిరుపతి-పూరి (17480), మహబూబ్‌నగర్-విశాఖపట్టణం (12862), విశాఖపట్టణం-మహబూబ్‌నగర్ (12861), తిరుపతి-విశాఖపట్టణం (08584), సికింద్రాబాద్-షాలీమార్ (12774)

4వ తేదీన రద్దయిన రైలు

షాలీమార్-సికింద్రాబాద్ (12773)

దారి మళ్లించిన రైళ్లు

హైదరాబాద్-షాలీమార్ (18046), న్యూఢిల్లీ-విశాఖపట్టణం (20806), విశాఖపట్టణం-న్యూఢిల్లీ (22805), హైదరాబాద్-విశాఖపట్టణం (12728)....

ఇవి పగిడిపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా వెళ్తాయి.


స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో ఎస్ఐ ఆదినారాయణ

20 కిలోల గంజాయి స్వాధీనం

ఆరుగురిని అరెస్టు చేసిన రాజమహేంద్రవరం వన్ టౌన్ పోలీసులు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అటు గంజాయి అమ్ముతూ... ఇటు ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తూ విలాస జీవితానికి అలవాటుపడిన ఆరుగురిని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం వన్‌టౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. జాంపేటలోని ముగ్గుపేట చర్చి సెంటర్ సమీపంలో సమాధుల వద్ద నిల్వ ఉంచిన 20కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. సీటీఆర్ఐ సుబ్బారావునగర్‌కి చెందిన తేలంశెట్టి సాయి భార్గవ్, తాడితోట అంబేడ్కర్ నగర్‌కి చెందిన నేతల వివేక్ (మార్లిస్), బత్తిన రవితేజ, దాసరి చందు, రెల్లిపేటకు చెందిన రాయి సింహాద్రి అప్పన్న, వీరభద్ర నగర్‌కి చెందిన సోరా దుర్గను అదుపులోకి తీసుకున్నామని సీఐ ఎస్.మురళీకృష్ణ పేర్కొన్నారు. భార్గవ్, మార్లిస్ నుంచి వివిధ కేసులకు సంబంధించి కారు, 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ ఆదినారాయణలను ఎస్పీ నరసింహ కిషోర్, డీఎస్పీ రమేశ్‌బాబు అభినందించారు.

వెల్ల నివేశనా స్థలాల కేసు కొట్టివేత

ద్రాక్షారామ, సెప్టెంబరు 2: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెల్ల లాకుల వద్ద నివేశనా స్థలాల కేసును రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సోమవారం కొట్టివేసింది. వెల్ల లాకుల వద్ద నివాసముంటున్న 22 మంది పట్టాదారులను ఖాళీ చేయించేందుకు 2012 మార్చి 20న రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలు చర్యలు చేపట్టాయి. స్థలాలు ఖాళీ చేయించడాన్ని లబ్ధిదారులు, రైతుకూలీ సంఘం నాయకులు అడ్డుకున్నారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. రైతు కూలీ సంఘం నాయకులు ఉండ్రు గనిరాజు, బత్తుల సిద్ధూలతో పాటు 19 మందిపై కేసులు నమోదు చేశారు. 12ఏళ్ల పాటు విచారణ జరిగింది. సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో కేసు కొట్టి వేసినట్టు పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ తెలిపారు. దీనిపై ఆయనతో పాటు రైతు కూలీ సంఘం నాయకుడు వెంటపల్లి భీమశంకరం హర్షం వ్యక్తం చేశారు. న్యాయవాదులు నీలం మధుసూదనరావు, సూరంపూడి సత్యనారాయణ, పచ్చిమళ్ల సంపతరావు, నీలం స్నేహలతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. పట్టాదారులు 22 మందికి న్యాయం చేయాలని మంత్రి సుభాష్‌కు రైతు కూలీ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు.

శృంగవరంలో డయేరియా విజృంభణ

- రౌతులపూడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 21 మంది

రౌతులపూడి, సెప్టెంబరు 2: కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం శృంగవరం గ్రామంలో డయేరియా విజృంభించింది. అధ్వాన పారిశుధ్యంతో గ్రామస్తులు డయేరియా బారిన పడ్డారు. అల్లు పాదలియ్య, గొనగాలి పెంటమ్మ, ఈగల వీరబాబు, కోన రమణ, జి.సత్యవతి, లొండా గోవిందమ్మ, అల్లు గంగరాజు, జి.లోవసత్తిబాబు, అల్లు రమణ, గదులు రమణ సహా 21మంది రౌతులపూడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి నరసింహనాయక్, సహాయ వైద్యాధికారి పి.సరిత గ్రామంలో పర్యటించారు. డయేరియా ప్రబలడానికి గల కారణాలను తెలుసుకున్నారు. బావిని పరిశీలించారు. రక్షిత నీరు అందించే పైపుల్లో మురికి నీరు చేరి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చికిత్స అందిస్తున్నారు. డయేరియా ప్రబలడానికి గల కారణాలపై పూర్తిగా విచారించి వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన పరామర్శించారు.


డయేరియా బాధితులను పరామర్శిస్తున్న జిల్లా వైద్యాధికారి నరసింహనాయక్

వెంటాడిన మృత్యువు

అంబులెన్స్‌ను ఢీకొట్టిన కారు... ఎగిరిపడి రోగి మృతి

కాకినాడ రూరల్, సెప్టెంబరు 2: తీవ్రమైన అనారోగ్యంతో ఉన్న రోగిని తీసుకెళ్తున్న అంబులెన్స్‌ను కారు ఢీకొట్టడంతో మృతి చెందిన సంఘటన కాకినాడ సర్పవరం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. కాకినాడ రూరల్ మండలం వాకలపూడికి చెందిన పెద్దిరెడ్డి రాధాకృష్ణ (45) కొనేళ్లు ఉద్యోగం చేసి రెండేళ్ల క్రితం కాకినాడ వచ్చి స్థానికంగా ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. అతడికి భార్య లక్ష్మి, ఇంటర్ చదువుతున్న హర్షిత అనే కుమార్తె ఉన్నారు. సోమవారం తెల్లవారుజామున రాధాకృష్ణ తీవ్రమైన అనారోగ్యంతో ఇబ్బందిపడుతుండటంతో ట్రస్ట్ ఆసుపత్రికి ఫోన్ చేయగా వారి అంబులెన్స్ వచ్చింది. దాంట్లో తరలిస్తుండగా సర్పవరం కూడలి వద్దకు వచ్చేసరికి కారు వెనుక నుంచి అంబులెన్స్‌ను ఢీకొట్టడంతో దాని టైరు పేలి రోగి రాధాకృష్ణ ఎగిరి కిందపడి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులెవరూ ఫిర్యాదు చేయలేదని, ట్రస్టు ఆసుపత్రి అంబులెన్స్ డ్రైవరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సర్పవరం సీఐ పెద్దిరాజు తెలిపారు.

గుండాల డంప్ నుంచి తెలంగాణకు ఇసుక రవాణా

టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్న భద్రాచలం పోలీసులు



ఎటపాక, సెప్టెంబరు 2: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గుండాల ఇసుక డంప్-1 నుంచి ఇసుక అక్రమ మార్గంలో తెలంగాణకు తరలిపోతున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం గుండాల డంప్ నుంచి టిప్పర్‌లో ఇసుక లోడ్ చేసుకుని భద్రాచలం రవాణా చేస్తున్న క్రమంలో భద్రాచలం పట్టణ పోలీసులు టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇటీవల గుండాల ఇసుక డంప్-1 వద్ద కొందరు వ్యాపారస్తులు బినామీ లబ్ధిదారుల ఆధార్ నెంబర్లతో గ్రామ సచివాలయంలో బుక్ చేసుకుని, లోడింగ్ పాయింట్ వద్ద ఇసుక లోడ్ చేసుకుని యథేచ్ఛగా తెలంగాణ ప్రాంతాలకు తరలిస్తున్నట్టు ఆరోపణలు వున్నాయి. పోలీసు, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ, నిఘా కొరవడడంతోనే ఇసుక తెలంగాణకు తరలిపోతున్నట్టు తెలుస్తోంది. రాత్రివేళల్లో కూడా ఈ డంప్ నుంచి ఇసుక దొంగ తనంగా తరలిపోతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణాలోపంతోనే ఇసుకను కొందరు వ్యాపార స్తులు దొంగతనంగా పట్టుకెళ్తున్నారన్నారు. పురుషోత్తపట్నం చెక్‌పోస్టు వద్ద పోలీసులు పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసి తెలంగాణకు అక్రమంగా రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు కోరారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

ఎంత కష్టమొచ్చిందో!

వర రామచంద్రాపురం, సెప్టెంబరు 2: వీఆర్ పురం సంత వద్ద గుర్తు తెలియని వ్యక్తులు లేగ దూడను కిరాతకంగా నరకడంతో పేగులు బయటకు వచ్చాయి. ఆ దూడను చూసిన వారు పశు వైద్యులకు సమాచారం ఇచ్చారు. రేఖపల్లి పశు వైద్యురాలు డాక్టర్ రాజేశ్వరి, సిబ్బంది శ్రీకాంత్, కృష్ణార్జునరావు మూడు గంటలు కష్టపడి ఆ దూడకు శస్త్ర చికిత్స చేశారు.



డెంగీతో వ్యక్తి మృతి


మృతి చెందిన రమణ (పాత చిత్రం)

రాజవొమ్మంగి, సెప్టెంబరు 2: అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం లబ్బర్తి గ్రామానికి చెందిన పొడుగు రమణ (40) సోమవారం ఉదయం డెంగీతో మృతి చెందాడు. దీనిపై లాగరాయి వైద్యాధికారిణి ఉషశ్రీని వివరణ కోరగా.. రమణ టైఫాయిడ్, కామెర్లతో కొన్ని రోజులుగా వైద్యం పొందుతూ శనివారం లాగరాయి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడన్నారు. మలేరియా, డెంగీ ర్యాపిడ్ టెస్టు (ప్రాథమిక) చేయగా మలేరియా నెగిటివ్, డెంగీ పాజిటివ్ వచ్చిందన్నారు. పూర్తిస్థాయిలో డెంగీ టెస్టు చేయించుకుని వైద్యం పొందేందుకు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశామని చెప్పారు. రమణను వైద్యాధికారులు ఏ ఆసుపత్రికీ రిఫర్ చేయలేదని, సకాలంలో సరైన వైద్యం అందకే మృతి చెందాడని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఎంపీడీవో యాదగిరేశ్వరరావు విలేకరు లతో మాట్లాడుతూ మండలంలో సోమవారం డెంగీ కేసులు ఏమీ నమోదైనట్టు వైద్యులు రిపోర్టులు ఇవ్వలేదన్నారు. రమణ మృతిపై మాత్రం సంబంధిత వైద్యాధికారి ఉషశ్రీ డెంగీ వీక్ పాజిటివ్ వచ్చిందని చెప్పారన్నారు.

రైలు రద్దుతో... వ్యాన్‌లో వెళ్తుండగా

కేసముద్రం వద్ద వాగులో కొట్టుకుపోయిన రామవరం, కుతుకులూరు వాసులు

ఒకరిని కాపాడిన రెస్క్యూ టీమ్... మరొకరి ఆచూకీ కోసం గాలింపు


గల్లంతైన నాగభూషణం (పాత చిత్రం)

అనపర్తి, సెప్టెంబరు 2: వ్యాపారం నిమిత్తం తెలంగాణ వెళ్లిన తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరం, కుతుకులూరు గ్రామాలకు చెందిన ఇద్దరు వాగులో గల్లంతయ్యారు. వీరిలో ఒకరిని రెస్క్యూ టీమ్ కాపాడగా మరొకరి ఆచూకీ లభించలేదు. రామవరం గ్రామానికి చెందిన టీకి సునీల్, కుతుకులూరుకు చెందిన నక్కిన నాగభూషణం రామగుండం నుంచి హైదరాబాద్ వెళ్లే సంఘమిత్ర ట్రైన్ ఎక్కారు. అది మధ్యలోనే నిలిచిపోవడంతో కేసముద్రం నుంచి మహబూబాబాద్ వెళ్లేందుకు డీసీఎం వ్యాన్ ఎక్కారు. అది కేసముద్రం వద్ద వాగులో కొట్టుకుపోయింది. సునీల్‌ను రెస్క్యూ టీమ్ కాపాడి ఒడ్డుకు చేర్చారు. గల్లంతైన నాగభూషణం కోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సునీల్‌కు ఫోను చేసి పరామర్శించారు. భూషణం ఆచూకీ కోసం ప్రయత్నం చేయాలని అక్కడి అధికారులను ఫోనులో కోరారు.


వీరంగం చేసిన ఎద్దును అదుపు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఎద్దు వీరంగం: ఇద్దరికి గాయాలు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 2: ఓ ఎద్దు వీరంగం చేయడంతో హోంగార్డుతో పాటు ఒక మహిళ గాయాలపాలైంది. స్థానిక భానుగుడి కూడలి వద్ద విధుల్లో ఉన్న హోంగార్డు మహేష్‌ను కుడి కాలు తొడపై పొడవడంతో బలమైన గాయమైంది. మరో మహిళను కూడా గాయపర్చింది. వారిద్దరినీ నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఆ ఎద్దు వార్ఫ్ రోడ్డు మీదుగా జగన్నాథపురం బ్రిడ్జి వద్ద తుప్పల్లోకి వెళ్లగా ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకుని వెటర్నరీ వైద్యులకు అప్పగించారు. అనంతరం ఆ ఎద్దును సంరక్షణ నిమిత్తం జంతు హింస నివారణా సంఘం (ఎస్‌పీసీఏ)కి అప్పగించినట్టు ట్రాఫిక్ సీఐ రమేష్ చెప్పారు.

ఏజెన్సీ సమాచారం


రంపచోడవరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు

రంపచోడవరం, సెప్టెంబరు 2: రంపచోడవరంలో డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఆ పార్టీ రంపచోడవరం మండల శాఖ అధ్యక్షుడు పాబోలు శ్రీను ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



రాజవొమ్మంగి: జనసేన మండల శాఖ అధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు ఆధ్వర్యంలో దూసరపాము గ్రామంలో కూటమి నాయకులు మొక్కలు నాటారు. రాజవొమ్మంగి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. రాజవొమ్మంగి, దూసరపాము గ్రామాల్లో కేక్ కట్ చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కుర్ల రాజశేఖర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్పంచ్ గొల్లపూడి రమణి, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు తాము సూరిబాబు పాల్గొన్నారు.



వర రామచంద్రాపురం: జీడిగుప్ప, చొక్కనపల్లి, శ్రీరామగిరి, వీఆర్ పురంల్లో జనసేన జెండాలను ఆవిష్కరించారు. రేఖపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగు లకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. వీఆర్ పురంలో గోపు వీర రాఘవయ్య నివాసం వద్ద జరిగిన సమావేశంలో జనసేన మండల శాఖ అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ, జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ఆచంటి శ్రీను, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు మాట్లాడారు. జనసేన ఉపాధ్యక్షురాలు బాగుల ప్రమీల, అధ్యక్ష, కార్యదర్శులు బి.అంజన్‌రావు, కోట్ల రామ్మోహన్‌రెడ్డి, సాయి, పవన్, రాజిరెడ్డి, టీడీపీ నాయకులు బీరక సూర్యప్రకాశరావు, బురక కన్నారావు, శంకర్ పాల్గొన్నారు.



దేవీపట్నం: ఇందుకూరుపేటలోని వెలుగు కార్యాలయం వద్ద రంపచోడవరం నియోజకవర్గ జనసేన పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ కుర్ల రాజశేఖర్ రెడ్డి జనసేన జెండాను ఆవిష్కరించారు. జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ కారం కృష్ణబాబు, తహసీల్దారు పి.రామకృష్ణ, ఎంపీడీవో డీఎన్ రత్నకుమారి, ఏపీవో లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కొత్తపల్లి సత్యనారాయణ, గొల్ల చంటిబాబు, కట్టుమూరి వీరబాబు, మట్ట పెద్దకాపు, పోతుల గాంధీ పాల్గొన్నారు.



అడ్డతీగల: అడ్డతీగలలో జనసేన మండల శాఖ అధ్యక్షుడు కుప్పాల జయరామ్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేశారు. పాఠశాలలో మొక్కలు నాటారు. అడ్డతీగల దేవి సెంటర్లో కేక్ కట్ చేసి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. 50 మంది నిరుపేద వృద్ధులకు చీరలు పంపిణీ శారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ మెంబర్ తాటికొండ రాజేంద్ర ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేట్టారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూనవరం: మండలంలోని కోతులగుట్టలో అన్నదానం నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ జనసేన కార్యకర్తలు ర్యాలీ చేశారు. జనసేన మండల శాఖ ఉపాధ్యక్షుడు బండారు సాంబశివరావు, పంచాయతీ సర్పంచ్ హేమంత్, మండలాధ్యక్షుడు నరేంద్ర, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులతో పాటు హెచ్‌ఎం భోజనం చేయాలి

చింతూరు, సెప్టెంబరు 2: ప్రతి పాఠశాల, ఆశ్రమ పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ఆదేశించారు. సోమవారం ఆయన ఐటీడీఏ సమావేశ మందిరంలో విద్యా శాఖ ముఖ్యులతో సమీక్షించారు. రుచికరమైన ఆహారం అందించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థులతో కలిసి కూర్చుని భోజనం చేయాలని ఆదేశించారు. వంట పాత్రలు, వంట గదులు, పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూడాలని, అవసరమైన చోట బ్లీచింగు చల్లాలన్నారు. ఆయా పనులను ఎప్పటికప్పుడు నోట్ కామ్ ద్వారా ఫొటోలు తీసి వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయాలన్నారు. ఏ ఒక్క చర్యా సక్రమంగా చేపట్టని పక్షంలో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పీవో హెచ్చరించారు. ఎంఈవోలు, ఏటీడబ్ల్యువో, ప్రధానోపాధ్యాయులు,ఎస్ఓలు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

వాగుల వద్ద రెవెన్యూ, సచివాలయ సిబ్బంది నియామకం

రంపచోడవరం, సెప్టెంబరు 2: భారీ వర్షాల కారణంగా ఏజెన్సీలో కొండ కాలువలు పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో వాగుల వద్ద రెవెన్యూ, సచివాలయ సిబ్బందిని నియమించినట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయ చాంబరులో సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్ కుమార్‌తో కలిసి ఏడు మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సచివాలయ సిబ్బందితో సహాయక చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీవో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అడ్డతీగల, మారేడుమిల్లి యూత్ ట్రైనింగ్ సెంటర్లలో 40-50 ఏళ్ల మధ్యవారికి జీవనోపాధి కల్పించేలా శిక్షణ ఇస్తామ న్నారు. సబ్ కలెక్టరు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. 2005కు ముందు కొండపోడు వ్యవసాయం చేసుకున్న గిరిజనులకు గ్రామసభ తీర్మానాలతో పూర్తి దర్యాప్తు చేసి సమర్పించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఎస్‌వో టి.మార్తమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి'

రంపచోడవరం, సెప్టెంబరు 2: ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలాన్ని కలిసి వినతిపత్రం ఇచ్చినట్టు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వై.విల్సన్‌బాబు తెలిపారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న 77 మంది అన్‌ట్రైన్డ్ ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, తెలుగు, హిందీ పండిట్స్, పీఈటీలను అప్‌గ్రేడ్ చేసి ప్రమోషన్లు ఇచ్చిన ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. పీవోను కలిసిన వారిలో బాబు, కె.ఆదిరెడ్డి, కె.సూరిబాబు, సీహెచ్‌ఆర్ సనాతన్‌బాబు, ఎన్.వెంగళరావు, డీపీ లింగన్న ఉన్నారు.

'ఆరోగ్యం, పోషకాహారంలపై అవగాహన పెంచాలి'

చింతూరు, సెప్టెంబరు 2: అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు ఆరోగ్యం, పోషకాహారంలపై అవగాహన పెంచాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ పేర్కొన్నారు. సోమవారం చింతూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చేపట్టే ఆరోగ్య కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా నిత్యం చేపడుతున్న కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, కూనవరం సీడీపీవో నాగలక్ష్మి, పర్యవేక్షణాధికారులు ప్రియాంక, వెంకటలక్ష్మి, వనజ, రాధ ఎల్‌డీసీ హరి, బీపీసీ రాజు, యూనిసెఫ్ నుంచి నిర్మల, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్వరాల అదుపునకు వైద్య శిబిరాలు

అనపర్తి, సెప్టెంబరు 2: రోజురోజుకు పెరుగుతున్న జ్వరాలను అదుపు చేసేందుకు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు రామవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎన్.సుమతీదేవి తెలిపారు. సోమవారం పీరా రామచంద్రపురం శివారు సింగరాయ కాలనీలో ఏర్పాటు చేసిన శిబిరంలో 80మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ పరీక్షలతో బాటు మలేరియా, డెంగ్యూ టెస్టులు చేశారు. శిబిరంలో డాక్టర్ కె.మీనాక్షీదేవి, ఎంపీహెచ్‌ఈవో కేవీవీ సుబ్రహ్మణ్యం, హెచ్ఎస్ శ్రీనివాస్, హెచ్‌వీ ఎస్.లక్ష్మి, సీహెచ్‌వోలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ ఆశయ సాధనకు పునరంకితం కావాలి

- జనసైనికులకు రాష్ట్ర కార్యదర్శి స్వరూపాదేవి పిలుపు
- ఘనంగా జనసేన అధినేత పుట్టినరోజు వేడుకలు
- పలుచోట్ల పార్టీ శ్రేణుల సేవా కార్యక్రమాలు

రాజానగరం, సెప్టెంబరు 2: డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ పునరంకితం కావాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా స్వరూపాదేవి పిలుపునిచ్చారు. పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను సోమవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. రాజానగరంలోని కొత్తకాలనీలో జరిగిన కార్యక్రమానికి స్వరూపాదేవి విచ్చేసి మాట్లాడారు. అలాగే మండలంలోని చక్రద్వారబంధం, రాజానగరం, వెలుగుబంద, నరేంద్రపురం, రాధేయపాలెం, తోకాడ, ముక్కినాడ, పల్లకడియం, కానవరం, తూర్పు గోనగూడెం గ్రామాల్లో పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమాల్లో చిరంజీవి అభిమాన సంఘం కార్యదర్శి సురేష్, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బిక్కవోలు: పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా వినాయక చవితిని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణలో భాగంగా బిక్కవోలు, పందలపాక గ్రామాల్లో కూటమి నాయకులు 5000 మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో పవన్‌కళ్యాణ్ పేరిట జనసైనికులు ప్రత్యేక పూజలు జరిపారు. ఆరికరేవుల గ్రామంలో యూపీ పాఠశాలలో మొక్కలు


కోరుకొండలో పవన్ పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే బత్తుల

నాటారు. మహిపాల వెంకటేష్ పిల్లలకు ప్యూరిఫైడ్ వాటర్ కిట్‌ను బహూకరించారు. కార్యక్రమంలో జనసేన నియోజవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కన్వీనర్ రావాడ నాగు, మండలాధ్యక్షుడు ఇందల వీరబాబు, బీజేపీ నాయకులు ఎం.శివరామకృష్ణంరాజు, పవన్‌కుమార్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పడాల రాము, ఆరికరేవుల, పందలపాక సర్పంచ్‌లు రెడ్డి నాగవేణికుమారి, సబ్బారపు పద్మావతి, ఉపసర్పంచ్ పడాల వెంకటరామారెడ్డి, నాయకులు పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి పాల్గొన్నారు.

కడియం: బుర్రిలంకలో చిరంజీవి సేవాసమితి అధ్యక్షుడు గెడ్డం శివ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 210 మంది, పొట్టిలంకలో కామిరెడ్డి సతీష్, జనసైనికుల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 150 మంది రక్తదానం చేశారు. ధన్వంతరి బ్లడ్‌బ్యాంక్ వైద్యపరీక్షలు చేశారు. రక్తదానం చేసిన వారికి జ్ఞాపికలు, పండ్లు అందజేశారు. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి శిబిరాల్ని ప్రారంభించారు. 24 ఏళ్లగా సేవా కార్యక్రమాలు చేపడుతున్న శివను పలువురు అభినందించారు. కార్యక్రమాల్లో వెలుగుబంటి నాని, పాటంశెట్టి రాంజీ, ముద్రగడ జమీ, వట్టికూటి జానకీరామ్, వై.శ్రీను, కలిదిండి గోవిందు, బొర్రు సుబ్రహ్మణ్యం, ఆదిమూలం సాయిబాబా, గుత్తుల హరిప్రసాద్, మల్లు పోలరాజు, యర్రా వేణుగోపాలరాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తి పంచాయతీ కార్యాలయం వద్ద జనసైనికులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విచ్చేసి కేక్‌ను కట్ చేసి పవన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పరిణితి చెందిన నాయకుడిగా ఎదిగారన్నారు. నాడు ఇప్పటంలో చేసిన ప్రకటన మేరకు వైసీపీ వ్యతిరేక ఓటును చీలనివ్వకుండా కూటమి ప్రభుత్వ ఏర్పాటులో ప్రధాన భూమికను


రంగంపేట: జి.దొంతమూరులో వృద్ధులకు వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

పోషించారన్నారు. ఆయనది విలువలతో కూడిన వ్యక్తిత్వమని అన్నారు. కార్యక్రమంలో రావాడ నాగు, కర్రి శేషారత్నం, సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, ఎన్‌ఆర్‌కే ప్రసాదరెడ్డి, వీరబాబు, గొలుగూరి భాస్కరరెడ్డి, చింతా ప్రకాశరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ధవళేశ్వరం: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పవన్‌కల్యాణ్ పుట్టినరోజును నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. మధ్యాహ్నం పారిశుధ్య కార్మికులు జనసేన నాయకుడు యడ్ల మహేష్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రంగంపేట: జి.దొంతమూరు గ్రామంలో జనసైనికులు, కూటమి నాయకులు కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వృద్ధులకు, మహిళలకు నూతన వస్త్రాలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే వడిశలేరు, రంగంపేట, సుభద్రంపేట, చంద్రేడు, పెదరాయవరం, ముకుందవరం, కోటపాడు,ఈలకొలను, మర్రిపూడి గ్రామాల్లో జనసైనికులు, కూటమి నాయకులు స్వచ్ఛభారత్ నిర్వహించి, వీధులను శుభ్రం చేశారు. ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆళ్ల గోవింద్,


పాలచర్లలో పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో జనసైనికులు


రాజమహేంద్రవరంలో వృద్ధురాళ్లకి చీరలు అందిస్తున్న ఎమ్మెల్యే వాసు

మండలాధ్యక్షుడు ఎలుగుబంటి సత్తిబాబు, బీజేపీ, జనసేన మండలాధ్యక్షులు ఎం.సాయిరాం, సత్తిబాబు, నాయకులు ఉద్దండ్రావు శ్రీను పాల్గొన్నారు.

కోరుకొండ: పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రారంభించారు. నియోజకవర్గంలో లక్ష మొక్కలు నాటాలన్నది లక్ష్యమని చెప్పారు. అలాగే ఎంపీడీవో కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో తహశీల్దార్ సుస్వాగతం, ఎంపీడీవో నరేష్‌కుమార్, జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి, తనకాల నాగేశ్వరరావు, కటకం అన్నపూర్ణ, కటకం చలం తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ అన్నారు. రాజమహేంద్రవరం షెల్టాన్ సెంటర్‌లో నాగరాజ ఫైనాన్స్ కంపెనీ అధినేత వల్లేపు మంగరాజు, టీడీపీ నేత రామినీడి మస్తాన్‌చౌదరి ఆధ్వర్యంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. రామాలయం సెంటర్‌లో బయ్యపునీడి సూర్య ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో 200 మొక్కలు పంపిణీ చేశారు. నారాయణ పురంలో జనసేన నాయకులు ఆదిబాబు భగవాన్ ఆధ్వర్యంలో మునిసిపల్ స్కూల్లో మొక్కలు నాటి, పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంచారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు వై.శ్రీను, వల్లేపు వీరాజు, రవి, సతీష్, సురంపూడి శ్రీహరి, ఠాగూర్, రాంబాబు, సూర్యమిత్ర బృందం పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జనసేన రూరల్ టీమ్ చేయూత ఆధ్వర్యంలో ఉండి రవితేజ, రూరల్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ సునీల్ పర్యవేక్షణలో అభిమానులు అధిక సంఖ్యలో రక్తదానం చేశారు. సంజీవని వాలంటరీ బ్లడ్‌బ్యాంకు వైద్యపరమైన సాంకేతిక సహకారం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, వై.శ్రీను, యానాపు ఏసు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఆర్టీసీ కాలనీలోని నాగమణి ట్యూషన్ సెంటర్ విద్యార్థులు పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పూలతో అభిషేకం చేసి కేక్ కట్ చేసి వేడుక చేసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలో పవన్ పుట్టినరోజు నిర్వహిస్తున్న చిన్నారులు

వైఎస్సార్ వర్ధంతి

- నివాళులర్పించిన వైసీపీ నాయకులు, అభిమానులు


కడియంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళుల్పిస్తున్న మాజీ మంత్రి వేణు

బిక్కవోలు, సెప్టెంబరు 2: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సోమవారం నిర్వహించారు. బలభద్రపురంలో రాజశేఖరెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కాపవరంలో సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, రంగాపురంలో ఎంపీపీ బుద్దాల కన్నారావు, మండల కన్వీనర్ పోతుల ప్రసాదరెడ్డి, సర్పంచ్ గండికోట వీరభద్రరావు, కొంకుదురులో ఎంపీటీసీ పీవీ ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు.

రాజానగరం: వెలుగుబంద గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ పేదల కోసం వైఎస్సార్ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, వాడ్రేవు శ్రీనివాసరావు, పేపకాయల ఆంజనేయులు, జక్కంపూడి జగపతి, నాతిపాం రాంబాబు, కూటి ప్రసాద్, ఆకుల శ్రీను, కొల్లి వీర్రాజు, ప్రగడ చక్రి, కుందేటి ప్రసాద్ పాల్గొన్నారు.

కడియం: కడియంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విచ్చేసి రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే జేగురుపాడు, కడియపులంక, బుర్రిలంక, వేమగిరి గ్రామాల్లో వైఎస్సార్ వర్ధంతిని వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు నిర్వహించారు.

ధవళేశ్వరం: స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్, బ్యారేజ్ సెంటర్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు మాజీ మంత్రి సీహెచ్ వేణుగోపాలకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కోరుకొండ: కోరుకొండలోని కాపవరం జంక్షన్ వద్ద వైఎస్‌ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న మహోన్నతుడు రాజశేఖరరెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక మంగళవారపుపేటలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ విచ్చేసి వైఎస్సాఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. 200 మందికి భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మార్గాని సురేష్, అడపా శ్రీహరి, ఇన్నీసుపేట బ్యాంకు డైరెక్టర్ జి.అన్నపూర్ణరాజు, బుడ్డిగ రాము, దువ్వాడ గౌరీశంకర్, బీకే లింగేశ్వరరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా..

- ఆహార పొట్లాలు, వాటర్ బాటిల్స్ వితరణ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 2 : విజయవాడ వరద బాధితులకు పలు సంస్థలు, నాయకులు అండగా నిలిచారు. రాజమహేంద్రవరంలోని ఐఎంఏ శాఖ 5 వేల ఆహారపొట్లాలు, వాటర్ బాటిళ్ల వితరణ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక వాహనాన్ని విజయవాడకు పంపినట్టు ఐఎంఏ ప్రతినిధులు తెలిపారు.



ఆహార పొట్లాలతో వెళుతున్న తిరుమల ప్రతినిధులు

తిరుమల ట్రస్ట్ నుంచి 4 వేల మందికి..

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 2: వరద బాధితులకు తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమల రావు సహాయం అందజేశారు. కలెక్టర్ ప్రశాంతి సలహా మేరకు సోమవారం తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 4 వేల మందికి బిరియానీ ప్యాకెట్లు, పెరుగన్నం, వాటర్ ప్యాకెట్లను ప్రత్యేక వాహనంలో పంపించారు. మరో 10వేల మందికి ఆహార పొట్లాలు తయారు చేసి పంపిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో తిరుమల డైరెక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపాల్ యు.శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగుబంటి యూత్ తరపున ఆహార పొట్లాలు

కడియం, సెప్టెంబరు 2: వరద బాధితులకు కడియం వెలుగుబంటి యూత్ తరపున ఆహార పొట్లాలు ప్రత్యేకంగా పంపించారు. కార్యక్రమాన్ని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని, వెలుగుబంటి కొండ్రాజు పర్యవేక్షించారు. అలాగే కడియపులంక నుంచి సర్పంచ్-ఇన్‌చార్జి పాటంశెట్టి రాంజీ ఆహారపొట్లాలు పంపించారు.

వరద బాధితులకు ఎమ్మెల్యే బత్తుల పరామర్శ

కోరుకొండ, సెప్టెంబరు 2: విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాలైన కొత్త రాజరాజేశ్వరి నగర్, అయోధ్యనగర్, సింగనగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఆయన సతీమణి వెంకటలక్ష్మి సోమవారం పర్యటించారు. బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాధితులకు 5వేల బిర్యానీ ప్యాకెట్లు, 5వేల వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో అన్నివిధాలా బాధితులను ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టర్ నారాయణకు ఫార్మసీ ఫెలోషిప్ అవార్డు

కోరుకొండ, సెప్టెంబరు 2: ఇండియన్ ఫార్మ స్యూటికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సీవీ నారాయణకు ఫార్మసీ రంగానికి అందించిన సేవలకు గుర్తింపుగా ప్రపంచ ఫెడరేషన్ ఆఫ్ ఫార్మసీ ఫెలోషిప్ అవార్డు దక్కింది. ఈ మేరకు ఆయనకు సౌతాఫ్రికాలోని కేప్‌టౌన్ నగరంలో జరుగుతున్న 82వ ప్రపంచ ఔషధ రంగ సమావేశంలో ఆ దేశ అధ్యక్షుడు శ్రీ పాల్ సింక్లియర్.. నారాయణను అవార్డు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు వికాస్ ఫార్మసీ కళాశాల చైర్మన్ తన్నీరు చిన సుబ్బారావు, సెక్రటరీ తన్నీరు భరత్‌వికాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ సుమలత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మురళీధర్, డాక్టర్ బి.శ్రీలక్ష్మి అభినందనలు తెలిపారు.

నేత్రదానంపై అవగాహన సదస్సు

కోరుకొండ, సెప్టెంబరు 2: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం కోరుకొండ పీహెచ్‌సీ వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్య శాఖాధికారులు మాట్లాడుతూ దేశంలో లక్షలాది మంది కార్నియా(నల్లగుడ్డు) దృష్టిహీనతతో చూపు కోల్పోతున్నారన్నారు. ఎవరైనా మరణించిన తర్వాత నేత్రదానం చేయడం ద్వారా చూపు వస్తుందన్నారు. ఈ సందర్భంగా కోరుకొండ పీహెచ్‌సీ రిటైర్డ్ సూపర్‌వైజర్, నర్సాపురానికి చెందిన మారిశెట్టి నాగేశ్వరరావు తన నేత్రాలను దానం చేస్తానని ముందుకు వచ్చారు.

వరిలో అక్కడక్కడా మాగుడు తెగులు

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

అనపర్తి/కడియం, సెప్టెంబరు 2: వరి పంటలో అక్కడక్కడా మాగుడు తెగులు కనిపిస్తోందని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు వెంకట నరసింహం, శ్రీనివాస్ చెప్పారు. మంగళవారం అనపర్తి, రాజమహేంద్రవరం సబ్‌డివిజన్ల పరిధిలోని అనపర్తి, కడియం గ్రామాల్లో పలు వరి పంటలను వారు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల ప్రభావం వరిపొలాలపై ఏమీ లేదని పంట ఆరోగ్యంగా ఉందని చెప్పారు. అయితే కొద్దిచోట్ల నీరు నిలిచినప్పటికీ ప్రస్తుతం ఇబ్బంది లేదని కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పంటను సంరక్షించుకోవచ్చునన్నారు. వర్షపు నీరు నుంచి తేరుకున్న పంటకు ఎకరాకు 20కిలోల పొటాష్, 20కిలోల యూరియా చల్లుకోవాలని సూచించారు. మాగుడు తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 ఎంఎల్/ప్రొపికొనజోల్ 1 ఎంఎల్/ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 0.4 గ్రా. టెబ్యూకొనజోల్/అజాక్సీస్ట్రోబిన్, టెబ్యూకొనజోల్ 1.5 ఎంఎల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. స్వర్ణ, ఎంటీయూ 1318 వంటి వరిరకాలకు నత్రజని ఎరువును తగ్గించుకోవాలన్నారు. ఈ బృందం వెంట ఏడీఏ కృష్ణ, ఏవోలు సురేష్, కె.ద్వారకాదేవి వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

జీవిత బీమా వారోత్సవాలు ప్రారంభం


జ్యోతిప్రజ్వలనతో వారోత్సవాలను ప్రారంభిస్తున్న సంధ్యారాణి

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 2: ప్రజల నమ్మకం, ఆదరణతోనే జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ) 68 ఏళ్లుగా విశేష సేవలందిస్తూ ముందుకు సాగుతుందని సంస్థ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి అన్నారు. మోరంపూడి జంక్షన్ వద్ద గల ఎల్ఐసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఉదయం వారోత్సవాలను ప్రారంభించి సంస్థ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఎల్ఐసీ ప్రపంచంలోనే నాలుగో అతి పెద్ద సంస్థగా అభివృద్ధి చెందడానికి పాలసీదారులకు అందిస్తున్న నాణ్యమైన సేవలే కారణమన్నారు. సౌత్ సెంట్రల్‌లో రాజమండ్రి డివిజన్ ప్రథమ స్థానంలో నిలవడానికి సహకరించిన ఏజెంట్లు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. మార్కెటింగ్ మేనేజర్ సత్యనారాయణ స్వామి మాట్లాడుతూ త్వరలో అమల్లోకి రానున్న మహిళల ప్రత్యేక ఏజెన్సీలు కూడా సంస్థ అభివృద్ధికి మరింత దోహదపడతాయన్నారు. వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సీఆర్ఎం మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు ఎం.కోదండరామ్, గుబ్బల రాంబాబు, ప్రసాద్, సాయి శ్రీనివాస్, గన్నయ్య, కిషోర్ పాల్గొన్నారు.

త్రిముఖ లింగేశ్వరుడికి బూరెలతో అభిషేకం

బిక్కవోలు, సెప్టెంబరు 2: కొంకుదురు గ్రామంలోని త్రిముఖ లింగేశ్వరునికి మాసశివరాత్రి సందర్భంగా భక్తులు ఆరువేల బూరెలతో ఆదివారం రాత్రి అభిషేకం జరిపారు. వరుణ దేవునికి అధిపతి అయిన శివునికి బూరెలతో అభిషేకం చేస్తే సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు వృద్ధి చెందుతాయని అర్చకులు రమణ, భాస్కరశర్మ తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పడాల వెంకటరామారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రాచీన ఆలయాలను దర్శించిన ట్రాఫిక్ డీఎస్పీ

బిక్కవోలు, సెప్టెంబరు 2: బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలను ట్రాఫిక్ డీఎస్పీ, ఇన్‌చార్జి రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ శ్రీనివాసులు సోమవారం దర్శించారు. ఈ సందర్భంగా ఆయన లక్ష్మీగణపతి, గోలింగేశ్వర, కుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈయన వెంట నాయకులు పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పల్లి రాజారెడ్డి, బేరా గోవిందు, చాగంటి సాయిబాబారెడ్డి, కొమ్మోజు శ్రీనివాస్, సీఐ శివగణేష్, ఎస్ఐ రవిచంద్రకుమార్ ఉన్నారు.

అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ ధర్మరాజుకు సత్కారం

ధవళేశ్వరం, సెప్టెంబరు 2: ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌డైరెక్టర్‌గా ఎన్నికైన యర్రమోతు ధర్మరాజును స్థానిక శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. గ్రామం నుంచి మొట్టమొదటి సారిగా అర్బన్ బ్యాంక్ డైరెక్టర్‌గా ధర్మరాజు ఎన్నిక కావడం ఆనందదాయకమని సంఘ నాయకులు పేర్కొన్ని అయన్ను కొనియాడారు. బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తానని ధర్మరాజు అన్నారు. కార్యక్రమంలో బత్తిన ఏడుకొండలు, కేతా శ్రీను, బత్తినప్రసాద్, దొమ్మేటి రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలాల అమావాస్య

దివాన్‌చెరువు, సెప్టెంబరు 2: పోలాల అమవాస్యవ్రతాన్ని సోమవారం మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణమాసంలో వచ్చే బహుళ అమవాస్యను పోలాల అమావాస్యగా పిలుస్తారు. దీనిలో భాగంగా తొలుత కంద మొక్కను పసుపు కుంకమలు, వివిధ రకాలపుష్పాలతో అలంకరించారు. అనంతరం గౌరీదేవిని ఆ కందమొక్కలోకి ఆవాహనం చేసి షోడశోపచారాలతో పూజలు చేశారు. బూరెలు, గారెలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. వ్రతకథను చదువుకుని అక్షితలు శిరస్సున ధరించారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

రంగంపేట, సెప్టెంబరు 2: రంగంపేటలో సారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్.ఐ తోట కృష్ణసాయి తెలిపారు. సోమవారం తన సిబ్బందితో కలిసి గ్రామంలో తనిఖీలు నిర్వహించగా కుడిపూడి సత్తిబాబు సారా విక్రయిస్తుండగా అరెస్ట్ చేసి అతడి నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు.

5న బొమ్మూరులో మినీ జాబ్‌మేళా

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 2 : రాజమహేంద్రవరం (బొమ్మూరు)లోని నాక్ ప్రాంగణంలో ఈ నెల 5న మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి హరీష్ చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు తెలిపారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, అపోలో పార్మసీ, కేఎల్ గ్రూపు కంపెనీలు హాజరవుతున్నాయని తెలిపారు. 19 నుంచి 35 ఏళ్లలోపు వయసు కలిగిన వారు అర్హులన్నారు. వివరాలకు 7396740041 నెంబరులో సంప్రదించాలన్నారు.


కార్పొరేషన్‌లో ఎలక్ట్రిక్ వాహనాలు

ఆ 8 వాహనాలు ఏమయ్యాయి!

- కార్పొరేషన్‌లో కార్లు మాయం
- 2019లో 15 వాహనాలు కేటాయింపు
- ప్రస్తుతం కనిపించేవి ఏడు మాత్రమే
- నేటికీ కానరాని 8 వాహనాల ఆచూకీ
- అధికారులు సొంత కార్ల వినియోగం
- కార్పొరేషన్ ఖర్చుతో షికారు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 2 : రాజమహేంద్రవరం నగర పాలక సంస్థకు చెందిన ఎలక్ట్రికల్ వాహనాలు మాయమయ్యాయి. ఎక్కడ ఉన్నాయో ఎలా ఉన్నాయో కూడా తెలియదు. 2019 లో 15 మహేంద్ర విట్ ఎలక్ట్రికల్ వాహనాలను నగరపాలక సంస్థకు ప్రభుత్వం కేటాయించింది. ఈ వాహనాలను నగరపాలక సంస్థలో వివిధ విభాగాల అధికారులకు కేటాయింపులు చేశారు. ఈ మేరకు కార్పొరేషన్ ఆవరణలోనే రీచార్జ్ పాయింట్లను ఏర్పాటు చేసి షెడ్లు నిర్మించారు. కొంత కాలం ఈ ఎలక్ట్రికల్ వాహనాలు బాగానే పనిచేశాయి. దీంతో కార్పొరేషన్‌కు చాలా ఆదా అయ్యింది. కట్ చేస్తే ఈ 15 వాహనాల్లో 8 కార్పొరేషన్‌లో కనిపించడంలేదు. కేవలం ఏడు వాహనాలు మాత్రమే తిరుగుతున్నాయి. మిగిలినవి మరమ్మతులకు గురయ్యాయా.. అసలు ఉన్నాయో లేవో కూడా తెలియని పరిస్థితి. ఎందుకంటే కార్పొరేషన్ షెడ్‌లో ఎప్పుడు చూసినా కేవలం ఆ ఏడు వాహనాలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. మిగిలిన వాహనాల ఆచూకీ మాత్రం లేదు.వాటిని మరమ్మతుల నిమిత్తం షెడ్‌కు తీసుకెళ్లినట్టు చెబుతున్నారు. ఎంత షెడ్‌కి తీసుకెళ్లినా నెలలోపే ఇచ్చేస్తారు అయితే చాలా కాలంగా అవి కనిపించకపోవడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి.ఆ వాహనాల స్థానంలో కొంత మంది అధికారులు కార్పొరేషన్ ఆయిల్‌తో వారి సొంత వాహనాలు వినియోగించడం కనిపించింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మేల్కొని ఆ 8 వాహనాలు ఏమయ్యాయనే దానిపై దృష్టి సారించాల్సి ఉంది.

నెలకూ ఆయిల్‌కే రూ.18 లక్షలు

గతంలో నగరపాలక సంస్థకు తక్కువ సొంత వాహనాలు ఉండేవి. కార్పొరేషన్ కమిషనర్‌కు మాత్రమే నగరపాలక సంస్థ వాహనం ఉండేది. అప్పట్లో మేయర్‌కు సొంత వాహనం కొనుగోలు చేశారు. అయితే అడిషనల్ కమిషనర్,డిప్యూటీ కమిషనర్‌తో పాటు ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్ రెవెన్యూ విభాగాల ఉన్నత అధికారులకు ప్రైవేట్ కార్లను టెండరు పద్ధతిలో పెట్టుకునేవారు.నగరపాలక సంస్థకు చెందిన వాహనాలు వినియోగించే ఆయిల్‌కు నెలకు రూ.18 లక్షలు ఖర్చవుతుండడంతో గత కమిషనర్లు క్రమేపి ఆయా వాహనాలను తగ్గించుకుంటూ వచ్చారు.. దీనిలో భాగంగా ప్రభుత్వం ఎలక్ట్రికల్ వాహనాలను సమకూర్చింది. ప్రస్తుతం ఆ వాహనాలు కనిపించక పోవడంతో మూణ్నాళ్ల ముచ్చటగానే మారింది.



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వరద

గోదారొచ్చింది!

కొవ్వూరు, సెప్టెంబరు 2 : మళ్లీ గోదారొచ్చింది.. ఇప్పటి వరకూ ఈ ఏడాది ఒక్కసారి మాత్రమే పెద్ద ఎత్తున వరద వచ్చింది..ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా అఖండ గోదావరి సోమవారం వరదతో పోటెత్తింది.గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, ఉపనదులు పొంగి గోదావరిలో కలుస్తున్నాయి. దీంతో కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద అఖండ గోదావరి పెరిగింది. క్షేత్రంలోని వీరభద్రస్వామి ఆలయం ఎదుట స్నానఘట్టంలో కాశీ విశ్వేశ్వరుడిని గోదావరి అభిషేకిస్తూ ముంచెత్తింది. వరద ప్రవాహంతో రాజమహేంద్రవరం, కొవ్వూరు మధ్య గోదావరి నిండు కుండలా ప్రవహిస్తుంది.

అభిమానం గుర్తుండేలా..

సాయం చేస్తే పది మందికి ఉపయోగపడాలి.. పది కాలాల పాటు నిలిచేలా ఉండాలి.. మరి అటువంటి సాయం ఎలా ఉంటుందంటారా? ఇలాగే.. భోజనం పెడితే ఒక రోజులో అరిగిపోతోంది.. చీరలు ఇస్తే ఒక ఏడాదిలో పాడైపోతాయి.. ఆ సాయానికి ఖర్చు చేసే డబ్బుతో ఒక పాఠశాలను దత్తత తీసుకుంటే ఎలా ఉంటుంది.. రాజానగరానికి చెందిన జన సైనికులు ఇదే చేశారు.. తమ అభిమాన హీరో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని ఏదో ఒకటి చేయాలని చాలాకాలంగా ఆలోచిస్తున్నారు.. ఒక ఐడియా జీవితాన్నే మార్చేస్తుందన్నట్టు.. వారికొచ్చిన ఐడియా పది మంది పిల్లలకు వెలుగుతెచ్చింది.. ఇంతకీ అదేమిటంటారా.. ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని దత్తత తీసుకుని డిజిటల్ తరగతిని తీర్చిదిద్దారు.. సోమవారం పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆ తరగతిని జనసేన రాష్ట్ర కార్యదర్శి గంటా స్వరూపాదేవి ప్రారంభించారు.. - రాజానగరం



మేమున్నామని..
వరద బాధితులకు అండగా..

- సీఎం పిలుపుతో స్పందన
- జిల్లా ప్రజల మహా దాతృత్వం
- ఒక్కరోజులోనే ముందుకు
- 16 వ్యాన్ల ద్వారా సాయం
- ఆహారపొట్లాలు..పాలు..నీళ్లు
- బెజవాడకు తరలింపు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

మేమున్నా అంటూ ముందుకొచ్చారు.. వరద బాధితులకు అండగా నిలిచారు.. జిల్లా ప్రజలు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు..గోదావరి జిల్లా ప్రజలు కష్టం వస్తే ఎంతలా ఆదుకుంటారో నిరూపించారు. భారీవర్షాలు, బుడమలేరు వరద ప్రభావానికి విలవిల్లాడిన విజయవాడ వరద బాధితులకు తూర్పుగోదావరి అండగా నిలిచింది. కనీవినీ ఎరుగని రీతిలో సాయం అందించారు. వరద బాధితులకు అండగా ఉండాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపునకు జిల్లా స్పందించింది. కలెక్టర్ పి.ప్రశాంతి ఆధ్వర్యంలో జిల్లాలో అనేక అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు ముందుకొచ్చారు. దాతల నుంచి రకరకాల రూపాల్లో సేకరించిన వాటిని జిల్లాలో పలు చోట్ల శాఖల ఆధ్వర్యంలో వండించి, సేకరించి లక్షలాది ఆహార పొట్లాలను, వాటర్ ప్యాకెట్లు, బాటిల్స్‌ను, బిస్కెట్లను 16 వాహనాల ద్వారా విజయవాడ పంపించారు. సీఎం నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు రాజమహేంద్రవరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయం వివిధ కంపెనీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. విజయవాడ వరద బాధితులకు సాయం అందించాలని కోరారు. దీనిపై స్పందించిన పెద్ద ఎత్తున సహాయం అంద జేశారు.దాతృత్వంతో ముందుకు వచ్చిన అధికారులు, రైస్‌మిల్లర్లు,ఐఎంఏ, వివిధ కంపెనీలు, ఎమ్మెల్యేలు, విజయవాడ ప్రజలకు తమ వంతుగా సహాయ సహకారాల అందించ డానికి ముందుకొచ్చిన ప్రతీ ఒక్కరికీ అభినందలు తెలిపారు.

సాయం చేశారిలా..

జిల్లా రెవెన్యూ, ఇతర శాఖల ఆధ్వర్యంలో 26 వేల ఆహార పొట్లాలు, 20 వేల కొవ్వొత్తులు, 20 వేల అగ్గిపెట్టెలు, 50 వేల బ్రెడ్ ప్యాకెట్లు, 25వేల బిస్కెట్ ప్యాకెట్లు, 2 లక్షల వాటర్ ప్యాకెట్లు పంపించారు. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 50 వేల బిస్కెట్ ప్యాకెట్లు, 20 వేల ఆహార పొట్లాలు, 20 వేల ఫుడ్ ప్యాకెట్లు, 20 వేల వాటర్ బాటిల్స్ పంపించారు. తిరుమల విద్యా సంస్థల తరఫున 4 వేల బిరియానీ ప్యాకెట్లు, 8వేల వాటర్ బాటిల్స్ పంపారు. మిల్లర్ల అసోసియేషన్ తరఫున 5 వేలు,ఐఎంఏ ద్వారా 5 వేలు,హోటల్ అసోసియేషన్ తరపున 8 వేలు, హార్లిక్స్ ఫ్యాక్టరీ తరపున 2500 ఆహార పొట్లాలు ప్రత్యేక వాహనాల ద్వారా పంపామన్నారు. కోరు కొండ నుంచి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ 5 వేల ఆహారపొట్లాలు అందజేశారు.కొవ్వూరు నియోజకవర్గం నుంచి 6 వేల ఆహారపొట్లాలు తరలించారు.కలెక్టర్ క్యాంపు కార్యాలయం వద్ద పాల వాహనానికి, సాయికృష్ణ థియేటర్ వద్ద ఫుడ్ ప్యాకెట్లు తీసుకెళ్లే వాహనాలకు కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్న రాముడు జెండాఊపి ప్రారంభించారు.


విజయవాడలో వరద బాధితులకు పంపించే పులిహోర పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి


విజయవాడ వెళ్లే ఆహార వ్యాన్‌కు జెండా ఊపుతున్న ఎమ్మెల్యే ముప్పిడి


విద్యుత్ భద్రతకు సంబంధించి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, కార్మికులు

తడిచేతులతో స్విచ్‌లు వేస్తే ప్రమాదం
ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 2 : తడిచేతులు.. తడికాళ్ళతో ఉన్నప్పుడు స్విచ్‌లు వేయరాదని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ కె.తిలక్ కుమార్, ఈఈ నక్కపల్లి శామ్యూల్ సూచించారు. విద్యుత్ పట్ల ప్రజలు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. రాజమహేంద్రవరం మోరంపూడి టౌన్ 1 సబ్ డివిజన్ కార్యాలయం ఆవరణలో సోమవారం జరిగిన విద్యుత్ భద్రత దినోత్సవంలో వారు మాట్లాడారు.వైరింగ్‌కు ఉపయోగించే వైర్లు,స్విచ్‌లు ఐఎస్ఐ నాణ్యత కలిగి ఉండాలన్నారు. ఇంటికి ఎర్త్ ఇచ్చినప్పుడు కనీసం రెండు ఎర్త్ ఎలక్ట్రోడ్లను అమర్చాలని సూచించారు. విద్యుత్ భద్రతకు సంబంధించి ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో టౌన్ డీఈఈ గాబ్రియేల్, టౌన్ 1 డీఈఈ మాల్యాద్రి, ఏఈలు, జేఈలు తదితరులు పాల్గొన్నారు.

2689.22 హెక్టార్లలో పంట మునక
జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీ వర్షాలకు 4 మండలాల పరిధిలోని 44 గ్రామాల్లో 2689.22 హెక్టార్ల పంట మునిగినట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాదవరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని గోకవరం మండలంలో 5020 హెక్టార్లలో పంట వేయగా 6 గ్రామాల పరిధిలో 755 మంది రైతులకు చెందిన 668 హెక్టార్లు మునిగిందన్నారు. కోరుకొండ మండలంలో 4600 హెక్టార్లలో వరి పంట వేయగా 18గ్రామాల పరిధిలో 1800 మంది రైతులకు చెందిన 1200 హెక్టార్లు, నిడదవోలు మండలంలో 16500 హెక్టార్లలో వరి పంట వేయగా 5 గ్రామాల్లో 31 మంది రైతులకు చెందిన 25.22 హెక్టార్ల పంట నీట మునిగిందన్నారు. సీతానగరం మండలంలో 3966 హెక్టార్లలో వరిసాగు చేయగా 14 గ్రామాల పరిధిలో 942 మంది రైతులకు చెందిన 776 హెక్టార్ల పంట మునిగిందని తెలిపారు. అదే మండలంలోని ఒక గ్రామంలో 10 మంది రైతులకు చెందిన 20 హెక్టార్ల చెరకు మునిగినట్టు చెప్పారు. కొవ్వాడ కాలువ ఉధృతి తగ్గిందని, ఎర్రకాలువకు వరదొచ్చినా ఇబ్బందిలేదని పేర్కొన్నారు.



గాలిలో.. ఎగిరారు!
విమాన ప్రయాణానికి డిమాండ్

- విజయవాడ అతలాకుతలం
- బస్సులు బంద్..రైళ్లు రద్దు
- తప్పని విమానయానం
- నిండుగా ఎయిర్‌పోర్ట్
- రెండు రోజులుగా కిటకిట
- పెరిగిన ప్రయాణికుల సంఖ్య

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వర్షాల కారణంగా రైలు, రోడ్డు రవాణా అస్తవ్యస్తం కావడంతో ప్రజలు వాయు మార్గాన్ని ఎంచుకోక తప్పని పరిస్థితి నెలకొంది. ఆది, సోమవారాల్లో రాజమహేంద్రవరం (మధురపూడి) విమానాశ్రయం నుంచి రాకపోకలు పెరిగాయి. నాలుగు రోజుల నుంచీ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు సోమవారం కాస్త శాంతించిన విషయం తెలిసిందే. రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్, బెంగళూరు ఎక్కువగా వెళుతుంటారు. వరద వల్ల జంక్షన్ పాయింట్ అయిన విజయవాడ అతలాకుతలమైంది. దీంతో రైలు పట్టాలు, రోడ్లు దెబ్బతిన్నాయి.ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం గుండా వెళ్లే సుమారు 20 రైళ్లను రద్దు చేశారు.ఆదివారం సాయంత్రం కాకినాడ- రేణిగుంట ఎక్స్‌ప్రెస్‌ను రాజమహేంద్రవరం వచ్చిన తరువాత నిలిపివేయడంతో 1500 మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.విజయవాడ వెళ్లే బస్సులను కూడా నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు విమానాల వైపు చూస్తున్నారు. గత వారం ప్రారంభంలో సాధారణంగా ఉన్న రద్దీ.. శని, ఆది, సోమవారాల్లో క్రమంగా పెరిగింది. ప్రస్తుతం రాజమహేంద్రవరం నుంచి ఇండిగో మాత్రమే ఏటీఆర్-72 రకం విమానాలను ఆపరేట్ చేస్తోంది. ఆదివారం, బుధవారం, శనివారాల్లో 10, మిగతా రోజుల్లో 9 విమానాలను నడుపుతోంది. హైదరాబాద్‌కు 7, బెంగళూరుకు 2, చెన్నైకి ఒకటి చొప్పున రాకపోకలు సాగిస్తున్నాయి. విమాన ధరలు ఇప్పటికీ సామాన్యుడికి అందనంత ఎత్తులోనే ఉన్నాయి. జిల్లాకో ఎయిర్‌పోర్ట్ అంటూ గాలి మాటలు చెప్పిన గత వైసీపీ ప్రభుత్వం.. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, ఏజెన్సీ ప్రజలకు ఏకైక వాయుమార్గమైన రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి ఒక్క ఆపరేటర్‌ని కూడా పెంచలేకపోయింది. ఒకే ఆపరేటర్ ఉండడంతో పోటీతత్వం నిర్వీర్యమైంది. రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌కి రూ.4800 నుంచి రూ.7 వేల వరకూ వెచ్చించాల్సి వస్తోంది. దీంతో అత్యవసరమైతే తప్ప సామాన్యుడి విమానం ఎక్కలేని దుస్థితి ఉంది. నైట్ ల్యాండింగ్ సదుపాయం వచ్చిన తర్వాత రాత్రి 9.30 గంటలకు విమానం అందుబాటులోకి వచ్చింది. కానీ సామాన్యుడికి మాత్రం ఎలాంటి ప్రయోజనమూ లేకుండా ఉంది. వాస్తవానికి ఒకేసారి మూడు విమానాల ప్రయాణికులు.. అంటే సుమారు 225 మంది ఒక్కసారిగా వచ్చినా హ్యాండిల్ చేసే సామర్థ్యం విమానాశ్రయానికి ఉంది.కానీ ఆ మేరకు విమాన ఆపరేటర్ల సంఖ్యను పెంచాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం 10 విమానాల్లో మొత్తం గరిష్ఠంగా 760 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించవచ్చు.

విమాన ప్రయాణాలు ఇలా..

రోజు	రాక	పోక
శుక్రవారం	406	486
శనివారం	505	544
ఆదివారం	600	662
సోమవారం	700	750

ఆర్టీసీ సర్వీసులు పునరుద్ధరణ
జిల్లా అధికారిణి షర్మిలా అశోక

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 2 : భద్రాచలం, విజయవాడ రూటులో రద్దయిన ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించారు. భారీ వర్షాల కారణంగా ఈ రెండు రూట్లలో బస్సులు నడపడానికి కొంత ఇబ్బంది తలెత్తడంతో భద్రాచలం వయా మారేడుమిల్లి ఘాట్ రోడ్డు సర్వీసుతో పాటు విజయవాడ రూటులో కొన్నింటిని తాత్కాలికంగా రద్దు చేసిన సంగతి తెలిసిందే. వీటన్నింటినీ సోమవారం నుంచి పూర్తిస్థాయిలో నడిపేందుకు చర్యలు చేపట్టారు. వర్షాలు, వరదల కారణంగా ఒకటి, రెండురూట్లలో బస్సు సర్వీసులకు కాస్త ఇబ్బంది తలెత్తినా ప్రస్తుతం అన్ని సర్వీసులను యధాతథంగా తిప్పుతున్నామని ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిలా అశోక తెలిపారు. విజయవాడకు ట్రాఫిక్‌ను బట్టి ఆపరేట్ చేయడం జరిగిందని, రూటు కేన్సిల్ చేయలేదన్నారు. హైదరాబాద్ సర్వీసులు కూడా పూర్తిస్థాయిలో ఆపరేట్ చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రయాణికులు గమనించాలని తెలిపారు.

కలెక్టరేట్‌కు వచ్చినా.. ఇంతేనా!?
సమస్యలు పరిష్కారం కాక పలువురు ఆవేదన

- వచ్చిన వారే మళ్లీ మళ్లీ రాక
- బదలాయించి వదిలేస్తున్న వైనం
- లబోదిబోమంటున్న బాధితులు
- కలెక్టరేట్‌కు ఎందుకొస్తామని ప్రశ్న
- అడపాదడపా మాత్రమే పరిష్కారం
- కలెక్టర్ దృష్టి పెట్టాలని డిమాండ్
- పీజీఆర్ఎస్‌లో 144 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, సెప్టెంబరు 2 : వస్తున్నాం.. వెళుతున్నాం అంతే.. సమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. కిందిస్థాయి అధికారులకు బదలాయించి కలెక్టరేట్ అధికారులు వదిలేస్తున్నారని.. అక్కడ పనికాకపోవడంతో ఇక్కడకు వచ్చామని ఆలోచించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ఫిర్యాదులపై కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించాలని పలువురు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మీ కోసం ప్రజా సమస్యల పరిష్కారవేదిక జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వివిధ మండలాలకు చెందిన ప్రజలు వచ్చి అర్జీలు పెట్టుకున్నారు. 144 అర్జీలు వచ్చాయి.ఆర్ఆర్‌సీఎస్‌డీసీ ఆర్.కృష్ణనాయక్, జిల్లా సహకార సంఘాల అధికారి శ్రీరాములు ,దిశ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలో ఖాళీగా ఉన్నవాటికి మాత్రమే రేషన్ డీలర్ల నోటిఫికేషన్ ఇవ్వాలని రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు బి.రాజు, జనరల్ సెక్రటరీ ఎం.వెంకటేశ్వరరావు అర్జీ అందించారు. కడియం మండలం కడియపులంక వెంకాయమ్మపేటకు చెందిన డ్వాక్రా గ్రూప్ సభ్యులు తమ యానిమేటర్ తమకు తెలియకుండా అవకతవకలకు పాల్పడుతుందని బాధితులు ఫిర్యాదు చేశారు.నిడదవోలుకు సమిశ్రగూడెంకు చెందిన బుద్దేటి ఈశ్వర ప్రసాద్ తమ ప్రాంతంలో నడక దారిలో ఇల్లుకట్టడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని విన్నవించాడు., దవళేశ్వరానికి చెందిన దివ్యాంగుడు వేముల తిరపయ్య రూ.15 వేలు పింఛను ఇప్పించాలని అర్జీ పెట్టుకున్నాడు. ఇలా తదితర సమస్యలతో కలెక్టరేట్‌కు వచ్చారు.కలెక్టరేట్‌లో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ డిబాలశంకర్‌రావు, కలెక్టర్ ఏపీవో పి పాపారావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

పదేళ్లుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా..



నా పేరు దేవాదుల సుబ్రహ్మణ్యం.. మాది రాజమహేంద్రవరం ఇన్నీసు పేట.. సోమవారం కలెక్టరేట్‌లో అతని అర్జీ చూసి దానిని రాజమహేంద్రవరం ఆర్‌డీవోకు బదలాయించారు. చాలా ఏళ్లగా ఇదే జరుగుతుంది.. సమస్య మాత్రం పరిష్కారం కావడంలేదు. అంటూ అర్జీదారుడు సుబ్రహ్మణ్యం ఆవేదనతో వెళ్లిపోతుండగా ఆంధ్రజ్యోతి అతనితో మాట్లాడింది. రూరల్ మండలం కోలమూరులో సర్వే నెంబరు 627/5 ఏ1లోనా తండ్రి సత్యనారాయణాచార్యులకు 600 గజాల స్థలం ఉంది. అందులో 2003లో 300 చదరపు గజాల స్థలాన్ని విశాఖ వాటర్ పైప్‌లైన్‌కు తీసుకున్నారు. దీనికి సంబంధించి పరిహారం ఇవ్వలేదు.సుమారు పదేళ్లుగా తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడంలేదు. ఎప్పుడు వచ్చినా ఆర్‌డీవోకు బదలాయిస్తే ఎలా.. మళ్లీ మళ్లీ వస్తున్నామంటే కలెక్టర్ బాధ్యత తీసుకోవాలని కోరాడు. తనకు ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారని ఈ భూమి పరిహారమే తనకు దిక్కని కన్నీళ్లు పెట్టుకున్నాడు. అయితే వేదికపై కలెక్టర్ లేకపోవడంతో నిరాశచెందాడు. బాధితుడుకి న్యాయం చేయడంలో కలెక్టర్ ఏ విధంగా స్పందిస్తారో వేచిచూడాలి.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 23 అర్జీలు


కార్యాలయంలో అర్జీదారుల సమస్యలు వింటున్న ఎస్పీ నరసింహకిశోర్

రాజమహేంద్రవరం,సెప్టెంబరు 2 (ఆంధ్ర జ్యోతి):జిల్లా పోలీసు కార్యాల యంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం(మీకోసం) కార్యక్ర మా న్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 23 అర్జీలను ఎస్పీ నరసింహ కిశోర్ స్వీకరించారు. ఫిర్యాదుదారులతో మా ట్లాడి సత్వరమే పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఆయా పోలీస్ స్టేషన్ల బాధ్యులతో మాట్లాడి తగు సూచ నలు చేశారు.అర్జీదారులు రెండోసారి డీపీవోకి అదే సమస్యపై రాకుండా చట్ట పరిధిలో సంతృప్తికరమైన న్యా యం చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ అనసూరి శ్రీనివాస రావు, సీఐ కె.మంగాదేవి, ఎస్ఐ అలీఖాన్ పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆహార పొట్లాలు

చాగల్లు, సెప్టెంబరు 2: విజయవాడ వరద బాధితులకు పంపిణీ చేసేందుకు నియోజకవర్గం స్థాయిలో ఆహారం తయారు చేశారు. మండలానికి రెండు వేలు వంతున చాగల్లు, కొవ్వూరు, తాళ్లపూడి మండలాల నుంచి ఆరు వేలు పొట్లాలు తయారు చేశారు. వాటిని వ్యాన్‌లో విజయవాడ పంపారు. వ్యాన్‌ను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం అభినందనీయమన్నారు. మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీఎం మంగాయమ్మ, తహశీల్దార్ మెరికమ్మ, టీడీపీ నాయకులు ఆళ్ల హరిబాబు, కరుటూరి సతీష్, బొల్లిన శివనాగేంద్ర, దొంగ రామక్రిష్ణ, జనసేన నాయకులు ఉప్పులూరి చిరంజీవి, కొప్పాక విజయకుమార్, ఇంటి వీరబాబు పాల్గొన్నారు.

మినీ బైపాస్‌లో బార్‌తో న్యూసెన్స్ పెరిగింది

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 3 ఫిర్యాదులు

కొవ్వూరు, సెప్టెంబరు 2: కొవ్వూరులోని యువరాజ్ మాల్ వద్ద బార్ ఏర్పాటుతో న్యూసెన్స్ పెరిగిందని, చుట్టు పక్కల పాఠశాలలున్నాయని చర్యలు తీసుకోవాలని పలువురు ఫిర్యాదు చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన వారి నుంచి 3 ఫిర్యాదులను సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ స్వీకరించారు. ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



ఉప్పరగూడెంలో పాఠశాల ప్రహరీకి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, సెప్టెంబరు 2: విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. గోపాలపురంలోని ఉప్పరగూడెంలో రూ.14లక్షలతో నిర్మించనున్న పాఠశాల ప్రహరీకి ఆయన సోమవారం భూమిపూజ చేశారు. అనంతరం బీసీ గౌడ సామాజిక భవనాన్ని పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. అందులో భాగంగానే ఉప్పరగూడెంలోని ఎంపీయూపీ పాఠశాల ప్రహరీకి నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ సందర్భంగా టీడీపీ అభిమాని భూరెడ్డి శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే మద్దిపాటి పాల్గొన్నారు. శ్రీనివాస్ సమకూర్చిన 90కుర్చీలు, టెంట్‌హౌస్‌ను స్థానిక కమ్యూనిటీ హాలుకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహూకరించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, జ్యేష్ఠ శ్రీధర్, కూనపం ప్రసాద్‌బాబు, కాట్రగడ్డ సురేష్, వేముల నాగరాజు, కొడవటి గంగరాజు, సుబ్బారావు, పడమర శ్రీనివాస్, కొర్లపాటి రాము తదితరులు పాల్గొన్నారు.

కోట సత్తెమ్మకు సారె



అమ్మవారికి సారె తీసుకొచ్చిన బ్రాహ్మణ మిత్ర సేవా సంఘ సభ్యులు

నిడదవోలు, సెప్టెంబరు 2: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ తల్లికి సోమవారం జిల్లా బ్రాహ్మణ మిత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రావణ పట్టి (సారె) సమర్పించారు.కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పసిపాప వైద్యానికి ఆర్థిక సాయం

ఉండ్రాజవరం, సెప్టెంబరు 2: పెరవలి మండలం ఖండవల్లికి చెందిన కంతేటి గోవిందు దంపతులకు నెలలు నిండకుండానే ఓ పాప జన్మించింది. ఈ నేపథ్యంలో అనారోగ్యంతో ఉండడంతో విజయవాడ ఆసుపత్రిలో చేర్పించి కుటుంబ సభ్యులు వైద్యం చేయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న మండలంలోని కె.సావరం గ్రామానికి చెందిన జనసేవక్ ఫౌండేషన్ వారు పసిపాప వైద్యఖర్చులకు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని సోమవారం కుటుంబసభ్యులకు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మీసాల సురేష్, వర్రే రమేష్, నార్ని దుర్గారావు, బసవా రాజారత్నం, నార్ని వీరవెంకట్రావు, నాగిరెడ్డి నాని పాల్గొన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వేలు



కాల్ధరిలో రోగులకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సృజన

ఉండ్రాజవరం, సెప్టెంబరు 2: మండలంలోని పాలంగి, కాల్ధరి గ్రామాల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా ఫీవర్ సర్వేలు నిర్వహించారు. రోగులకు మందులను పంపిణీ చేశారు. సీజనల్ జ్వరాలు పట్ల ప్రజలకు సిబ్బంది అవగాహన కల్పించారు. పాలంగిలో డాక్టర్ ఆర్ఎస్ ప్రసాద్, కాల్ధరిలో డాక్టర్ వై.సృజన ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు జె.శ్రీనివాస్, కె.సుభాషిణి, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

చాగల్లు, సెప్టెంబరు 2: చోరీ కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ కె.నరేంద్ర మంగళవారం తెలిపారు. పసివేదలకు చెందిన మహిళ నెలటూరు వైపునకు నడుచుకుంటూ వెళ్తుండగా ముగ్గురు యువకులు ఆమె మెడలోని గొలుసును అపహరించుకునిపోయినట్టు గత నెల 2న కేసు నమోదు చేశారు. నిందితులు స్థానిక షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో ఉన్నట్టు సీఐ విజయబాబుకు సమాచారం తెలియడంతో వారిని అరెస్టు చేసినట్టు తెలిపారు. నిందితులను నిడదవోలు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు చెప్పారు.

విలాసాలకు అలవాటుపడి.. దారితప్పిన జీవితం

20కిలోల గంజాయి స్వాధీనం.. ఆరుగురి అరెస్టు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో ఎస్ఐ ఆదినారాయణ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అటు గంజాయి అమ్మకం.. లేదా ఇటు ద్విచక్ర వాహనాల చోరీలు చేస్తూ విలాస జీవితానికి అలవాటు పడిన ఆరుగురిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జాంపేటలోని ముగ్గపేట చర్చి సెంటర్ సమీపంలోని సమాధుల వద్ద నిల్వ ఉంచిన 20కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. సీటీఆర్ఐ సుబ్బారావునగర్‌కి చెందిన తేలంశెట్టి సాయి భార్గవ్, తాడితోట అంబేడ్కర్‌నగర్‌కి చెందిన నేతల వివేక్ (మార్లిస్), బత్తిన రవితేజ, దాసరి చందు, రెల్లిపేటకు చెందిన రాయి సింహాద్రి అప్పన్న, వీరభద్రానగర్‌కి చెందిన సోరా దుర్గను అదుపులోకి తీసుకున్నామని సీఐ ఎస్.మురళీకృష్ణ పేర్కొన్నారు. భార్గవ్, మార్లిస్ నుంచి వివిధ కేసులకు సంబంధించి కారు, 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ ఆదినారాయణను ఎస్పీ నరసింహ కిషోర్, డీఎస్పీ రమేశ్‌బాబు అభినందించారు.

జ్వరాల అదుపునకు వైద్య శిబిరాలు

అనపర్తి, సెప్టెంబరు 2: రోజురోజుకు పెరుగుతున్న జ్వరాలను అదుపు చేసేందుకు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు రామవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎన్.సుమతీదేవి తెలిపారు. సోమవారం పీరా రామచంద్రపురం శివారు సింగరాయ కాలనీలో ఏర్పాటు చేసిన శిబిరంలో 80మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ పరీక్షలతో బాటు మలేరియా, డెంగ్యూ టెస్టులు చేశారు. శిబిరంలో డాక్టర్ కె.మీనాక్షీ దేవి, ఎంపీహెచ్ఈవో కేవీవీ సుబ్రహ్మణ్యం, హెచ్ఎస్ శ్రీనివాస్, హెచ్‌వీ ఎస్.లక్ష్మి, సీహెచ్‌వోలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



నిడదవోలులో నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న మంత్రి దుర్గేష్



పెరవలి: కాకరపర్రులో దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం



కొవ్వూరులో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, రామారావు తదితరులు

అభిమాన.. పవనాలు

- ఘనంగా జనసేనాని పవన్‌కల్యాణ్ పుట్టినరోజు
- అభిమానులు, కార్యకర్తల సేవా కార్యక్రమాలు

నిడదవోలు, సెప్టెంబరు 2: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజును అభిమానులు, జనసేన కార్యకర్తలు సేవా కార్యక్రమాలకు చిరునామాగా మార్చారని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. డిప్యూటీ సీఎం, జనసేన అధినేత కొణిదల పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. నిడదవోలులోని గణేష్ చౌక్ సెంటరులో జనసేన స్థూపం ఆవిష్కరించారు. అనంతరం మానసిక దివ్యాంగుల కేంద్రం హృదయాలయానికి నిత్యావసర వస్తువులు, బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పవన్ అభిమానులందరూ సేవా కార్యక్రమాలతో పాటు ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు, పవన్‌కళ్యాణ్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని కాకరపర్రు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పారిశుధ్య కార్మికులకు, దివ్యాంగులకు బట్టలు పంపిణీ, పెరవలిలో వైద్య శిబిరం మొక్కలు నాటే కార్యక్రమాల్లో మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పాల్గొన్నారు. అలాగే పవన్ అభిమానులు, జనసేన కార్యకర్తలు కానూరు, కానూరు అగ్రహారం, తీపర్రు, అజ్జరం, కాపవరం, ఖండవల్లి, ముక్కామల, అన్నవరప్పాడు, మల్లేశ్వరం, కొత్తపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీపర్రులో ప్రత్తిపాటి ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో 150 మంది వృద్ధులకు దుప్పట్లు, విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. నిడదవోలు-నరసాపురం రోడ్డులో తీపర్రు పరిధిలో సుమారు కిలోమీటరు మేర రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చారు. కార్యక్రమాల్లో పిప్పర రవి, నందిప శ్రీనివాస చక్రవర్తి, పోలా లక్ష్మీపార్వతి సీతయ్య, పప్పొప్పు సూర్య నాగేశ్వరరావు, అతికాల శ్రీను పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరు విజయవిహార్ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచారు. అనంతరం పట్టణ పురవీధులను చీపుర్లతో శుభ్రం చేశారు. రామారావు మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ సూచనల మేరకు ఏపీని క్లీన్ అండ్ గ్రీన్ రాష్ట్రంగా తీర్చిద్దిడానికి జనసైనికులు కృషిచేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పదేళ్ల పాటు సంరక్షించాలన్నారు. మెరకవీధి వినాయకుని గుడి వద్ద జనసేన పట్టణాధ్యక్షుడు డేగల రాము ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. మండలంలోని కాపవరం, పెనకనమెట్ట తదితర గ్రామాల్లో కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, సూర్యదేవర రంజిత్, దాయన రామకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, కె. నవ్య, కళ్ళేపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. మండలంలోని దొమ్మేరు ఆదరణ అంధుల ఆశ్రమంలో జనసైనికులు అన్నదానం చేశారు.

నల్లజర్ల: నల్లజర్లలో పవన్‌కల్యాణ్ అభిమానులు నతిరెడ్డి వినాయక, నక్క హరికృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సేవ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పాల్గొని మొక్కలు నాటి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 50మంది అభిమానులు రక్తదానం చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కేట్ చేసి స్వీట్లు పంచారు. చీపురుగుడెంలో జనసేన మండల కార్యదర్శి చెల్లు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మద్దిపాటి కేక్ కట్ చేసి, మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ రావూరి రమణ, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, ఆలపాటి రామకృష్ణ, పుల్లి బాలాజీ, యర్ర గణేష్, ఉన్నమట్ల రాజు, విడియాల శ్రీను, షేక్ బాషీర్, గుదే సుబ్బారావు, ముళ్ళపూడి కృష్ణమూర్తి, సవలం రామకృష్ణ, అచ్యుత సత్యనారాయణ పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని గజ్జరం గ్రామంలో జరిగిన కార్యక్రమానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు విచ్చేసి కేకును కట్ చేసి, మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పూలపల్లి బాలకృష్ణ, సర్పంచ్ గండి రాంబాబు, ఉప సర్పంచ్ దండమూడి శేషు, కాకర్ల వంశీ పాల్గొన్నారు. అన్నదేవరపేటలో జరిగిన కార్యక్రమానికి అల్లూరి విక్రమాదిత్య విచ్చేసి కేకు కట్ చేసిన అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పెద్దేవంలో నామపన చినబూరయ్య ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం వద్ద మొక్కలు నాటారు. మదర్ థెరిస్సా హోంలో భోజనాలు ఏర్పాటు చేశారు. బల్లిపాడులో పెండ్యాల ప్రసాద్ ఆధ్వర్యంలో టీవీ రామారావు మొక్కలు నాటారు. వేగేశ్వరపురంలో మండలాధ్యక్షుడు గంటా కృష్ణ పాల్గొని 500 మంది విద్యార్థులకు అభ్యసనా సామగ్రి అందజేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. తాళ్లపూడిలో ఐతం మణికంఠ ఆధ్వర్యంలో పవన్ పుట్టినరోజు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో చెవ్వూరి బంగార్రాజు, కూచిపూడి గణపతి, ముళ్లపూడి శ్రీరామచంద్రమూర్తి, కొడి శంకరం, బోడపాటి గంగరాజు, గనిశెట్టి నవీన్, గంగాధర్, దేవన సత్తిబాబు, గొట్టం వీర్రాజు, బల్లె శ్రీను, బండారు నాగకుమారి, బరిగంటి శ్రీను, గంటా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: కలవలపల్లిలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు విచ్చేసి కేక్ కట్ చేశారు. గ్రామంలో మొక్కలు నాటారు. టీడీపీ నాయకులు ఆళ్ల హరిబాబు, కరుటూరి సతీష్, అబ్బూరి సీతారాముడు, జనసేన నాయకులు గాయత్రి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి చిరంజీవి, చల్లా చంద్రరావు పాల్గొన్నారు. చాగల్లు జూనియర్ బేసిక్ స్కూల్లో మొక్కలు నాటారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. జనసేన నాయకులు ఇంటి వీరబాబు, మిరియాల సతీష్ తదితరులు పాల్గొన్నారు. బ్రాహ్మణగూడెంలో కాజా సతీష్ ఆధ్వర్యంలో పవన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

దేవరపల్లి: మండలంలోని దేవరపల్లి, యాదవోలు, దుద్దుకూరు గ్రామాల్లో పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరపల్లి పీహెచ్‌సీలో రోగులకు పండ్లు రొట్టు పంపిణీ చేశారు.అలాగే కృష్ణంపాలెం, గొల్లగూడెం వయోవృద్ధుల ఆశ్రమాల్లో భోజన వసతి కల్పించారు. కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు అనిశెట్టి గంగరాజు, చప్పటి శివనాగప్రసాద్, కంబాల సత్తిబాబులు మాట్లాడుతూ సినీరంగంలో హీరోగానే కాకుండా నిజ జీవితంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి రియల్‌హీరో అయ్యారని కొనియాడారు. రాష్ట్రంలో కౌలు రైతులను ఆదుకున్నారని, రాజకీయ రంగ ప్రవేశం చేసి రాష్ట్ర ప్రజల మన్ననలు పొందరన్నారు. కార్యక్రమంలో పసుపులేటి శివనాగప్రసాద్, అడబాల మణికంఠ, జాజిమొగ్గల శ్రీనివాస్, నాని, కృష్ణంపాలెం సర్పంచ్ నాయుడు దుర్గాప్రసాద్, ఎంపీటీసీ కాళ్ల వెంకటరత్నం, అనిశెట్టి శ్రీనివాస్, పోతుల కనకరాజు, కంటిపూడి సుబ్బారావు, కె.రవికుమార్, కాట్నం గణేష్ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: వేలివెన్ను గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మంత్రి దుర్గేష్ విచ్చేశారు. పవన్ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం పట్ల అభినందించారు. శేషారావు మాట్లాడుతూ ప్రజాసేవ చేయడానికి పవన్‌కు భగవంతుడు ఆయురారోగ్యాలు కలుగజేయాలని కోరారు. ఈ సందర్భంగా వారిద్దరూ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి దుర్గేష్ పారిశుధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, ఉపసర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాసరావు, టీడీపీ,జనసేన మండలాధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, వీరమళ్ల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



నల్లజర్లలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి



తాళ్లపూడి: వేగేశ్వరపురంలో విద్యార్థులకు అభ్యసనా సామగ్రి అందించిన కృష్ణ



చాగల్లులో కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు



దేవరపల్లిలో కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు, అభిమానులు



ఉండ్రాజవరం: వేలివెన్నులో మొక్క నాటుతున్న మంత్రి దుర్గేష్

వైఎస్సార్ వర్ధంతి

- నివాళులర్పించిన వైసీపీ నాయకులు, అభిమానులు



కొవ్వూరులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి

కొవ్వూరు, సెప్టెంబరు 2: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని సోమవారం పలుచోట్ల నిర్వహించారు. కొవ్వూరు మెరకవీధి వాటర్ ట్యాంకు వద్ద ఆయన విగ్రహానికి తలారి వెంకట్రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆరోగ్యశ్రీ పేరు వినగానే వైఎస్సార్ గుర్తుకు వస్తారని తలారి అన్నారు. కార్యక్రమంలో కోడూరి శివరామకృష్ణ, బండి పట్టాభిరామారావు, కంటమణి రమేష్‌బాబు, కవల నాగేశ్వరరావు, పరిమి సోమరాజు పాల్గొన్నారు.

నల్లజర్ల: చీపురుగూడెంలో చెల్లు హరిబాబు వైఎస్సార్ విగ్రహానికి పాలభిషేకం చేసి, పూలమాలలతో నివాళులర్పించారు. గాలింకి రాంబాబు, వసంతా ఇశ్రాయేలు, కొరపాటి హరిప్రసాద్, వీర వెంకట్రావు పాల్గొన్నారు. అనంతపల్లిలో జరిగిన కార్యక్రమంలో బంకా అప్పారావు, కలం సత్యనారాయణ, దుర్గారావు, బళ్ల నాని పాల్గొన్నారు.

తాళ్లపూడి: వేగేశ్వరపురంలో వైఎస్సార్ విగ్రహానికి సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు పూలమాలలతో నివాళులర్పించారు. అలాగే పెద్దేవంలో వైసీపీ నాయకులు, గజ్జరంలో సర్పంచ్ గండి రాంబాబు, మలకపల్లిలో కుంట ముక్కల కేశవ నారాయణ.. రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, బట్టు సుబ్బారావు, మైలవరపు రాధాకృష్ణ, సూలా పోసియ్య, నున్న కృష్ణ, తైలం ప్రసాద్ పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని దేవరపల్లి, యర్నగూడెం, చిన్నాయిగూడెం గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు వైసీపీ నాయకులు పూలమాలలతో నివాళులర్పించారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి ప్రజా సంక్షేమంతో పాటు రైతుల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమాల్లో గన్నమని జనార్దనరావు, జడ్పీటీసీ స్వర్ణలత, ఎంపీటీసీ రామలక్ష్మి, వచ్చా గోపాల్, దుగ్గిన గంగాధర్, దుర్గారావు, కడిమి రాజు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా మాజీ చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు.


జీవిత బీమా వారోత్సవాలు ప్రారంభం



జ్యోతిప్రజ్వలనతో వారోత్సవాలను ప్రారంభిస్తున్న సంధ్యారాణి

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 2: ప్రజల నమ్మకం, ఆదరణతోనే జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ) 68 ఏళ్లుగా విశేష సేవలందిస్తూ ముందుకు సాగుతుందని సంస్థ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి అన్నారు. మోరంపూడి జంక్షన్ వద్ద గల ఎల్ఐసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఉదయం వారోత్సవాలను ప్రారంభించి సంస్థ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఎల్ఐసీ ప్రపంచంలోనే నాలుగో అతి పెద్ద సంస్థగా అభివృద్ధి చెందడానికి పాలసీదారులకు అందిస్తున్న నాణ్యమైన సేవలే కారణమన్నారు. సౌత్ సెంట్రల్‌లో రాజమండ్రి డివిజన్ ప్రథమ స్థానంలో నిలవడానికి సహకరించిన ఏజెంట్లు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. మార్కెటింగ్ మేనేజర్ సత్యనారాయణ స్వామి మాట్లాడుతూ త్వరలో అమల్లోకి రానున్న మహిళల ప్రత్యేక ఏజెన్సీలు కూడా సంస్థ అభివృద్ధికి మరింత దోహదపడతాయన్నారు. వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సీఆర్ఎం మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు ఎం.కోదండరామ్, గుబ్బల రాంబాబు, ప్రసాద్, సాయి శ్రీనివాస్, గన్నయ్య, కిషోర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలాల అమావాస్య



దివాన్‌చెరువు, సెప్టెంబరు 2: పోలాల అమావాస్యవ్రతాన్ని సోమవారం మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణమాసంలో వచ్చే బహుళ అమావాస్యను పోలాల అమావాస్యగా పిలుస్తారు. దీనిలో భాగంగా తొలుత కంద మొక్కను పసుపు కుంకమలు, వివిధ రకాలపుష్పాలతో అలంకరించారు. అనంతరం గౌరీదేవిని ఆ కందమొక్కలోకి ఆవాహనం చేసి షోడశోపచారాలతో పూజలు చేశారు. బూరెలు, గారెలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. వ్రతకథను చదువుకుని అక్షితలు శిరస్సున ధరించారు.

వరిలో అక్కడక్కడా మాగుడు తెగులు

- ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు నరసింహం, శ్రీనివాస్
- అనపర్తి, కడియంలో పొలాల పరిశీలన



అనపర్తిలో రైతులతో మాట్లాడుతున్న ఏరువాక శాస్త్రవేత్తలు

అనపర్తి/కడియం, సెప్టెంబరు 2: వరి పంటలో అక్కడక్కడా మాగుడు తెగులు కనిపిస్తోందని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు వెంకట నరసింహం, శ్రీనివాస్ చెప్పారు. మంగళవారం అనపర్తి, రాజమహేంద్రవరం సబ్‌డివిజన్ల పరిధిలోని అనపర్తి, కడియం గ్రామాల్లో పలు వరి పంటలను వారు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల ప్రభావం వరిపొలాలపై ఏమీ లేదని పంట ఆరోగ్యంగా ఉందని చెప్పారు. అయితే కొద్దిచోట్ల నీరు నిలిచినప్పటికీ ప్రస్తుతం ఇబ్బంది లేదని కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పంటను సంరక్షించుకోవచ్చునన్నారు. వర్షాపు నీరు నుంచి తేరుకున్న పంటకు ఎకరాకు 20కిలోల పొటాష్, 20కిలోల యూరియా చల్లుకోవాలని సూచించారు. మాగుడు తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 ఎంఎల్/ప్రొపికొనజోల్ 1 ఎంఎల్/ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 0.4 గ్రా. టెబ్యూకొనజోల్/అజాక్సీస్ట్రోబిన్, టెబ్యూకొనజోల్ 1.5 ఎంఎల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. స్వర్ణ, ఎంటీయూ 1318 వంటి వరిరకాలకు నత్రజని ఎరువును తగ్గించుకోవాలన్నారు. ఈ బృందం వెంట ఏడీఏ కృష్ణ, ఏవోలు సురేష్, కె.ద్వారకాదేవి వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

ప్రాచీన ఆలయాలను దర్శించిన ట్రాఫిక్ డీఎస్పీ



బిక్కవోలు, సెప్టెంబరు 2: బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలను ట్రాఫిక్ డీఎస్పీ, ఇన్‌చార్జి రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ శ్రీనివాసులు సోమవారం దర్శించారు. ఈ సందర్భంగా ఆయన లక్ష్మీగణపతి, గోలింగేశ్వర, కుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈయన వెంట నాయకులు పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్ చౌదరి, పల్లి రాజారెడ్డి, బేరా గోవిందు, చాగంటి సాయిబాబారెడ్డి, కొమ్మోజు శ్రీనివాస్, సీఐ శివగణేష్, ఎస్ఐ రవిచంద్రకుమార్ ఉన్నారు.

త్రిముఖ లింగేశ్వరుడికి బూరెలతో అభిషేకం

బిక్కవోలు, సెప్టెంబరు 2: కొంకుదురు గ్రామంలోని త్రిముఖ లింగేశ్వరునికి మాసశివరాత్రి సందర్భంగా భక్తులు ఆరువేల బూరెలతో ఆదివారం రాత్రి అభిషేకం జరిపారు. వరుణ దేవునికి అధిపతి అయిన శివునికి బూరెలతో అభిషేకం చేస్తే సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు వృద్ధి చెందుతాయని అర్చకులు రమణ, భాస్కరశర్మ తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పడాల వెంకటరామారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ ధర్మరాజుకు సత్కారం

ధవళేశ్వరం, సెప్టెంబరు 2: ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్‌గా ఎన్నికైన యర్రమోతు ధర్మరాజును స్థానిక శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. గ్రామం నుంచి మొట్టమొదటి సారిగా అర్బన్ బ్యాంక్ డైరెక్టర్‌గా ధర్మరాజు ఎన్నిక కావడం ఆనంద దాయకమని సంఘ నాయకులు పేర్కొన్ని ఆయన్ను కొనియాడారు. బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తానని ధర్మరాజు అన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ స్క్రీన్1	సరిపోదా శనివారం
వై.స్క్రీన్2	డిమోంటి
దేవిశ్రీ(గాయత్రి	డబుల్ ఇస్మార్ట్
అనన్య	ఆయ్

నిడదవోలు

వీ మ్యాక్స్	డిమాట్ కాలనీ
రాధాకృష్ణ	తంగలన్
శ్రీగణపతి	ఆయ్, కమిటీ కుర్రోళ్లు

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	డబుల్ ఇస్మార్ట్